# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక :319 మంగళవారం 21-7-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/







# పోటెత్తిన యువతరంగం

## చలో పార్లమెంట్‌కు పిలుపునిచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ

- ఉద్రిక్తంగా పార్లమెంట్ మార్చ్
- యువతపై లాఠీచార్జీ, టియర్‌గ్యాస్, వాటర్‌కెనాన్స్ ప్రయోగం
- ఇంటర్నెట్, మొబైల్ నెట్‌వర్క్ నిలిపివేత
- లాఠీదెబ్బలు తింటూనే పార్లమెంట్ సమీపంలోకి
- దూసుకెళ్లిన ఆందోళన కారులు ఉలిక్కిపడిన కేంద్రం
- సీజేపీ నేతలతో కేంద్రమంత్రుల చర్చలు
- అమిత్‌షాతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ
- వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు
- జాతీయ జెండాలు, అంబేద్కర్, భగత్ సింగ్, మహాత్మాగాంధీ చిత్ర పటాలతో యువత
- ఆస్పత్రిలో సోనమ్ వాంగ్ చుక్ దీక్ష కొనసాగింపు
- అబిజీత్ దీప్కే, ఎస్ఎఫ్ఐ నేతలు ఆదర్శ్, ఐషీ ఘోష్ తదితరులు దీక్షల విరమణ

న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ఉలిక్కి పడింది. దేశ యువతలోని ఆవేశం, ఆక్రోశం, ఆవేదన, ఆందోళనను తక్కువ అంచనా వేసిన కేంద్రం యువతరం పట్టుదలను చూసి ఖంగుతింది. నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఎన్టీఏను రద్దు చేయాలని, ఎన్ఈపీని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన 'పార్లమెంట్ మార్చ్' ఉద్రిక్తంగా మారింది. ఢిల్లీలో భారీ వర్షం కురుస్తున్నా విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా భారీ సంఖ్యలో పార్లమెంటు ప్రాంగణానికి చేరుకునే ప్రయత్నం చేశారు. వారిని చెదరగొట్టేందుకు కేంద్ర బలగాలు, పోలీసులు లాఠీచార్జీ చేశారు. టియర్‌గ్యాస్ ప్రయోగించారు. వాటర్ కెనాన్స్‌తో యువతను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. చేతుల్లో జాతీయ జెండాలు, అంబేద్కర్, భగత్ సింగ్,

-మిగతా 2 లో






## తెలంగాణలో క్యూఆర్ కోడ్‌తో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు

- 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ
- వారం రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూఆర్ కోడ్‌తో పటిష్ట భద్రతా ఫీచర్లతో కొత్త కార్డుల రూపకల్పన
- ఆగస్టు నుంచి మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ

హైదరాబాద్

రేషన్ సరుకులకు జులై 31 లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరి. తెలంగాణలో అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు కార్డుల స్థానంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్లాస్టిక్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనుంది. వారం రోజుల్లోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేందుకు పౌరసరఫరాల శాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పీవీసీ స్మార్ట్ కార్డుల రూపంలో రేషన్ కార్డులు ఇవ్వడం ఇదే తొలిసారి. ప్రస్తుతం లబ్ధిదారులు వాడుతున్న ఏ4 సైజు

-మిగతా 2 లో

## మేడిగడ్డ మరమ్మతులకు

# రంగం సిద్ధం

చివరి దశకు చేరుకున్న పరీక్షలు



- నిపుణుల నివేదికల ఆధారంగా పునరుద్ధరణ పనులు
- భద్రతా అనుమతుల తర్వాతే బ్యారేజీల నిర్వహణ
- శాస్త్రీయ విధానంతో కాళేశ్వరం బ్యారేజీల పునరుజ్జీవనానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముడుగు వేసింది. బ్యారేజీలపై నిర్వహిస్తున్న సమగ్ర శాస్త్రీయ పరీక్షలు చివరి దశకు చేరుకున్నాయని, వాటి ఆధారంగా మరమ్మతులు, పునరుద్ధరణకు అవసరమైన డిజైన్ల రూపకల్పన జరుగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, బ్యారేజీల పునరుద్ధరణలో ప్రభుత్వం పూర్తిగా శాస్త్రీయ విధానాన్నే అనుసరిస్తోందని స్పష్టం చేశారు. నిపుణులు భద్రతపై పూర్తి స్థాయిలో ధృవీకరించే

-మిగతా 2 లో




## యువతకు వ్యతిరేకి మోడీ: రాహుల్

- 175 పేపర్ లీకులు.. 75 లక్షల మంది బాధితులు
- పేపర్ లీక్ నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు
- విద్యార్థులు దెబ్బలు తింటున్నారు
- ఎక్స్‌లో రాహుల్ గాంధీ మండిపాటు




## ఫిఫా ఫైనల్‌లో ట్రంప్‌కు ఊహించని అవమానం

- స్పెయిన్ విజయోత్సవంలో ట్రంప్ ఓవర్ యాక్షన్?
- ట్రంప్‌ను స్టేజ్ నుంచి పక్కకు జరిపిన ఫిఫా చీఫ్!
- ప్రపంచం చూస్తుండగానే ట్రంప్‌కు షాక్..




## బ్రిటన్ ప్రధానిగా ఆండీ బర్న్‌హామ్

- స్టార్మర్ రాజీనామాతో బర్న్‌హామ్‌కు పగ్గాలు
- రాజు ఛార్లెస్ ఆహ్వానంతో కొత్త ప్రభుత్వ ఏర్పాటు
- మేయర్ నుంచి ప్రధాని పీఠం వరకు బర్న్‌హామ్ ప్రస్థానం
- 'కింగ్ ఆఫ్ ది నార్త్'గా గుర్తింపు.. ఇప్పుడు దేశ నాయకత్వం
- ఆర్థిక మందగమనం, పెరిగిన జీవన వ్యయాలే తొలి సవాళ్లు




## సెప్టెంబర్ 1 నుంచి బెంగాల్‌లో కొత్త రూల్

- మాతృభాషకు బెంగాల్ సర్కారు పెద్దపీట
- సెప్టెంబరు 1 నుంచి ప్రభుత్వ పనులన్నీ బెంగాలీలోనే
- పౌర సేవలు, పోర్టల్లు, పత్రాల్లో భాషా మార్పు
- కేంద్ర వ్యవహారాలకు హిందీ వినియోగం కొనసాగింపు
- భాషా విధానంపై కొత్త నిర్ణయం..
- మాతృ భాషకు పట్టం కట్టిన సీఎం సువేందు అధికారి!

పశ్చిమ బెంగాల్‌లో పరిపాలనా భాషగా బెంగాలీకి పెద్దపీట వేయాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026 సెప్టెంబర్ 1 నుంచి ప్రభుత్వ కార్యాలయాలు, పౌర సేవలు, అధికారిక పత్రాలు, డిజిటల్ వేదికలు సహా అన్ని ప్రభుత్వ వ్యవహారాల్లో బెంగాలీ భాష వినియోగం తప్పనిసరి చేయనున్నట్లు సీఎం సువేందు అధికారి ప్రకటించారు. ప్రజల భాషలోనే పాలన సాగించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం వెల్లడించింది.

## తెలంగాణ ఆర్టీసీ

# పేద ప్రజలకు జీవనాడి



- కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ప్రయాణికుల సౌకర్యమే ప్రభుత్వ లక్ష్యం
- ఆర్టీసీని మెట్రో, ఎంఎంటీఎస్‌తో అనుసంధానం చేస్తాం
- టీఎస్ఆర్టీసీ ఉద్యోగుల చేయూతతో శంకర్ కుటుంబానికి రూ.90.85 లక్షల ఆర్థిక సాయం
- మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా చెక్కు అందజేత
- కుమారుడు హేమంత్‌కు ఉద్యోగం, కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు

హైదరాబాద్

టీఎస్ఆర్టీసీ నర్సంపేట డిపోకు చెందిన దివంగత డ్రైవర్ కో శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగుల చేయూత కార్యక్రమం ద్వారా సేకరించిన రూ.90,85,500 ఆర్థిక సాయాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శంకర్ భార్య హేమలత, కుమారుడు హేమంత్, -మిగతా 2 లో

## కాళేశ్వరం నీళ్లు సముద్రం పాలు

- కన్నెపల్లి మోటార్లను ఆన్ చేయని సీఎం రేవంత్‌రెడ్డి
- రైతుల కోసం రక్తం ఇవ్వడానికైనా సిద్ధం : కేటీఆర్
- బీఆర్ఎస్‌లో చేరిన బాన్సువాడ ప్రముఖ వ్యాపారవేత్త మోరిల్ శ్రీనివాస్



హైదరాబాద్

కాళేశ్వరం నీళ్లు సముద్రం పాలవుతుంటే కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ప్రశ్నించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీలో ఉంటే ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలో పడుకుందని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బాన్సువాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మోరిల్ శ్రీనివాస్ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు కేటీఆర్ గులాబీ కండువా

-మిగతా 2లో

## తెలంగాణలో క్యూఆర్ కోడ్‌తో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు

(మొదటి తరువాయి)

కాగితపు కార్డులు త్వరగా చిరిగిపోవడం, పాడైపోతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా అందించే స్మార్ట్ కార్డులపై లబ్ధిదారుడి వివరాలతో పాటు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్, ఆహార భద్రతా కార్డు నంబర్‌ను ముద్రించారు. భద్రతా ఫీచర్లతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలు కూడా ఉంటాయి. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత వస్తుందని అధికారులు విశ్వసిస్తున్నారు. రాజధానిలో సీఎం కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్త కార్డులు అందజేయనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమం కోసం పౌరసరఫరాల శాఖ సమగ్ర ప్రణాళికను రూపొందించింది.

ఒకేసారి మూడు నెలల బియ్యం :

ఇదిలావుంటే.. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పేదలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనుంది. ఆగస్టు 1 నుంచి నెల రోజుల పాటు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయి. లబ్ధిదారులు మూడుసార్లు వేలిముద్రలు వేసి తమ కోటాను పొందవచ్చు. అయితే, ఈసారి రేషన్ సరుకులు పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకునేందుకు జులై 31ని ఆఖరి తేదీగా నిర్ణయించారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా తమకు దగ్గరలోని రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చని అధికారులు సూచించారు. గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోని వారికి రేషన్ సరుకులు అందవని స్పష్టం చేశారు.

## మేడిగడ్డ మరమ్మతులకు రంగం సిద్ధం

(మొదటి తరువాయి)

వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకురాబోమని వెల్లడించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్, నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ వంటి దేశంలోని అత్యున్నత సాంకేతిక సంస్థలు నేల స్వభావం, పునాదులు, కాంక్రీట్ నిర్మాణం, ఇతర నిర్మాణ భాగాలపై విస్తృత స్థాయిలో పరీక్షలు నిర్వహించాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఆ పరీక్షలు దాదాపు పూర్తయ్యాయని, వాటి ఫలితాలను ఐఐటీ బొంబాయికి పంపించగా, అక్కడ నిపుణులు సమగ్ర పునరుద్ధరణ డిజైన్ను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ప్రాథమిక అంచనాల ప్రకారం డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పునరుద్ధరణలో భాగం కావొచ్చని భావిస్తున్నప్పటికీ, అన్ని సాంకేతిక నివేదికలను పరిశీలించిన అనంతరమే తుది మరమ్మతుల విధానాన్ని నిర్ణయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక పర్యవేక్షణ కమిటీ, జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ, కేంద్ర జల సంఘం సూచనలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరణ కార్యక్రమాన్ని అమలు చేస్తూందని తెలిపారు.పునరుద్ధరణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు భారత సైన్యంలో సేవలందించిన అనుభవజ్ఞులైన ఇంజనీరింగ్ సేవలను ప్రభుత్వం వినియోగిస్తోందని, కల్నల్ పరీక్షి? మెహ్రో నేతృత్వంలోని సమన్వయ కమిటీ పరీక్షలు, సాంకేతిక ప్రణాళికలను పర్యవేక్షిస్తూ పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని పునరుద్ఘాటించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, శాస్త్రీయ పరీక్షలు, నిపుణుల రూపకల్పన, చట్టబద్ధ భద్రతా అనుమతులు పూర్తయిన తర్వాతే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ కీలక ప్రాజెక్టును శాశ్వత భద్రతతో పునరుద్ధరించి రాష్ట్ర అవసరాలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

## యువతకు వ్యతిరేకి మోడీ: రాహుల్

**- 175 పేపర్ లీకులు.. 75 లక్షల మంది బాధితులు**
**-పేపర్ లీక్ నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు**
**- విద్యార్థులు దెబ్బలు తింటున్నారు**
**-ఎక్స్‌లో రాహుల్ గాంధీ మండిపాటు**



న్యూఢిల్లీ

భారతదేశ చరిత్రలో అత్యంత యువత వ్యతిరేక ప్రధానిగా నరేంద్ర మోడీని లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. పేపర్ లీక్ చేసిన నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. విద్యార్థులు దెబ్బలు తింటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం యువతను విఫలం చేయడమే కాకుండా వారిపై దాడి చేస్తోందని ఆరోపించారు. దేశ యువత రీల్స్ చేస్తూ పకోడీలు వేస్తూ ఉండాలని ప్రధాని మోడీ కోరుకుంటున్నారని రాహుల్ గాంధీ అన్నారు. అన్ని విధాలుగా విఫలమైన విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించలేకపోయారు అని విమర్శించారు. 152 పేపర్ లీకులలో 75 లక్షల విద్యార్థులు బాధితులు. కానీ ఒక్క నేరస్థుడిని కూడా శిక్షించలేదు. ఎవరికి శిక్ష పడింది? కష్టపడే యువతకు అని ఆయన హిందీలో 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. విద్యపై చట్టపరమైన ప్రశ్నలు లేవనెత్తిన పుడు విద్యార్థులను లాఠీలతో కొట్టడం ద్వారా సమాధానం ఇస్తున్నారని అన్నారు.

## బ్రిటన్ ప్రధానిగా ఆండీ బర్న్‌హామ్

**-స్టార్మర్ రాజీనామాతో బర్న్‌హామ్‌కు పగ్గాలు**
**-రాజు ఛార్లెస్ ఆహ్వానంతో కొత్త ప్రభుత్వ ఏర్పాటు**
**-మేయర్ నుంచి ప్రధాని పీఠం వరకు బర్న్‌హామ్ ప్రస్థానం**
**-'కింగ్ ఆఫ్ ది నార్త్'గా గుర్తింపు.. ఇప్పుడు దేశ నాయకత్వం**
**-ఆర్థిక మందగమనం, పెరిగిన జీవన వ్యయాలే తొలి సవాళ్లు**

లండన్



బ్రిటన్ 59వ ప్రధ్ధంగా ఆండీ బర్న్‌హామ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ఛార్లెస్ రాజు ఆహ్వానించగా అందుకు బర్న్‌హామ్ అంగీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం క్యాబినెట్‌ను ఏర్పాటు చేసి మంత్రులకు శాఖలు కేటాయించారు. కెయిర్ స్టార్మర్ రాజీనామా నేపథ్యంలో ఆయన లేబర్ పార్టీ నాయకంుడిగా ఎన్ని కైన విషయం తెలిసిందే. సుమారు దశాబ్ద కాలం క్రితం పార్లమెంటును వదిలి గ్రేటర్ మాంఛెస్టర్ మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన బర్న్‌హామ్ కొద్ది వారాల క్రితమే తిరిగి చట్టసభలో అడుగు పెట్టారు. గత దశాబ్ద కాలంలో బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వారిలో బర్న్‌హామ్ ఏడవ వారు. గతంలో వివిధ లేబర్ ప్రభుత్వాలలో ఆయన అనేక పదవులు నిర్వహించారు. 2017లో పార్లమెంటును వదిలి గ్రేటర్ మాం ఛెస్టర్ మేయర్ అయ్యారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ఉత్తర ఇంగ్లండ్‌ను సమర్థించడం, ప్రాంతీయ పెట్టుబడుల కోసం ప్రచారం చేయడం ద్వారా బర్న్‌హామ్ బ్రిటన్‌లోం అత్యంత ప్రభావ వంతమైన ప్రాంతీయ నేతలలో ఒకరిగా ఎదిగా రు. ఆయనను అందరూ 'కింగ్ ఆఫ్ ది నార్త్' అని పిలుస్తారు. అందరితో సులభంగా కలిపి పోయే బర్న్‌హామ్...తన రాజకీయాలు భిన్నంగా ఉంటాయని చెబుతారు. అయితే బర్న్‌హామ్ ముందు ప్రస్తుతం అనేక సవాళ్లు ఉన్నాయి. మందకొడిగా ఉన్న ఆర్థిక వ్యవస్థ, పెరిగిపోతున్న జీవన వ్యయాలు వంటి సమస్యలు స్టార్మర్ నుంచి ఆయనకు వారసత్వంగా వచ్చాయి.

## పోటెత్తిన యువతరంగం

(మొదటి తరువాయి)

మహాత్మాగాంధీ చిత్ర పటాలతో లాఠీదెబ్బలు తింటూనే యువత పార్లమెంటు భవనం సమీపంలోకి చొచ్చుకెళ్లింది. ఈ ఘటనలో అనేక మంది యువతీ యువకులు, విద్యార్థులు గాయపడ్డారు. వందలాది మందిని అరెస్టు చేసి ఢిల్లీలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అయినా యువతరం బెదరలేదు. మరోవైపు పార్లమెంటులోనూ ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. సీజేపీ డిమాండ్లలో తప్పు ఏముందో చెప్పాలంటూ కేంద్ర మంత్రుల్ని నిలదీశారు. సర్కారు లోపాలు, బాధ్యతారాహి త్యానికి బాధ్యులు ఎవరని ప్రశ్నించాయి. ఇంటా, బయట పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా మారడంతో కేంద్రం దిగిరాక తప్పలేదు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా సీజేపీ నాయకులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా నాయకులు తమ మూడు ప్రధాన డిమాండ్లను ఆయన వద్ద పునరుద్ఘాటించారు. మరోవైపు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆస్పత్రిలో నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఎస్‌ఎఫ్ఐ నేతలు ఆదర్శ ఎం.సాజీ, ఆయుషీ ఘోష్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు నేహా, మనీష్, అమీన్ లు తమ దీక్షల్ని విరమించారు. న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తేల్చిచెప్పారు.

ఆందోళనకారులతో నిండిన జంతర్‌మంతర్??

సీజేపీ నేతృత్వంలో చేపట్టిన పార్లమెంట్ మార్చ్‌తో ఢిల్లీ జంతర్‌మంతర్ యువతరంతో నిండిపోయింది. విద్యార్థులు, యువతీ యువకులు భారీ సంఖ్యలో స్వచ్ఛందంగా అక్కడకు తరలివచ్చారు. వారి నిరసనలతో దేశ రాజధాని స్తంభించింది. భారీ వర్షం కురుస్తున్నా, పోలీసుల ఆంక్షలు హెచ్చరిస్తున్నా యువతరం ఎక్కడా బెదరలేదు. సోమవారం ఉదయాన్నే దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు, యువత, మద్దతుదారులు జంతర్ మంతర్ వద్దకు చేరుకున్నారు. వారికి సంఘీభావంగా పలువురు సినీ నటులు, రాజకీయ నేతలు, ప్రజాస్వామ్యవాదులు, హక్కుల కార్యకర్తలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.



ఎక్కడికక్కడ అడ్డగింతలు

పార్లమెంటు సమావేశాల ప్రారంభానికి ముందే దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చిన విద్యార్థులను పోలీసులు, కేంద్ర బలగాలు మెట్రో స్టేషన్లు, ఇతర ప్రాంతాల వద్దే అడ్డుకున్నాయి. జంతర్‌మంతర్ వద్దకు వెళ్లకుండా కట్టడి చేసే ప్రయత్నం చేశాయి. సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కే కు మద్దతు తెలిపేందుకు వచ్చిన పార్లమెంట్ సభ్యులు, రాజకీయ నేతలు, ఇతర ప్రముఖులను కూడా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో అక్కడ కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. చివరకు నేతలు దీప్కే నిరాహార దీక్ష చేపట్టిన వేదిక వద్దకు చేరుకొని సంఘీభావం తెలిపారు. మరోవైపు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, పారా మిలటరీ బలగాలతో ఢిల్లీ పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్ లను ప్రయోగించారు. చుట్టూ బారికేడ్లు, ఫెన్సింగ్ లతో విద్యార్థులు, యువతను నిర్బంధించారు. వారిపై పోలీసులు జులం ప్రదర్శించారు. పోలీసుల లాఠీచార్జీతో వందలాది మందికి గాయాలయ్యాయి. ఈ-డ్రోన్ వీడియోలో జంతర్ మంతర్ తో పాటు కిలోమీటర్ల పొడవున ఆందోళన కారులు బారులు తీరి కనిపించారు. ఆ పక్కనే ఉన్న పార్లమెంట్ స్ట్రీట్, రెసినా హిల్స్, ఇండియా గేట్, రాజేంద్ర ప్రసాద్ రోడ్, సెంట్రల్ ఢిల్లీ మొత్తం విద్యార్థులతో నిండిపోయింది.

పార్లమెంట్ సమీపానికి విద్యార్థులు, యువత మధ్యాహ్నం తరువాత జంతర్ మంతర్ నుంచి కిలో మీటర్ దూరంలో ఉన్న పార్లమెంట్ వైపునకు పెద్ద సంఖ్యలో ఆందోళనకారులు కదిలారు. జాతీయ జెండాలు, అంబేద్కర్, భగత్ సింగ్, మహాత్మా గాంధీ తదితర ప్రముఖుల చిత్ర పటాలను చేతిలో పట్టుకొని శాంతియుతంగా నినాదాలతో ముందుకు సాగారు. కొందరు సంసద్ మార్గ్ వైపు నుంచి పార్లమెంట్ చేరుకునేందుకు ప్రయత్నించారు. వారిని భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. నిరసనకారులపై పోలీసులు లాఠీలు ఝులిపించారు. పలువురికి గాయాలయ్యాయి. వీరికి అక్కడికక్కడే ప్రథమ చికిత్స అందించారు. మరోవైపు జంతర్ మంతర్ సర్కిల్ వద్ద నుంచి మరికొంత మంది పార్లమెంట్ వైపు కదం తొక్కారు. వీరిని పోలీసులు నిలువరించే ప్రయత్నం చేశారు. వేలాది సంఖ్యలో ఉన్న ఆందోళనకారులను అడ్డుకోవడం భద్రతా బలగాలకు సాధ్యం కాలేదు. నిర్బంధాలను ఎదుర్కొంటూ, లాఠీదెబ్బలు తింటూఆదే మార్గంలో ముందుకు నడుస్తూ, రైసినా హిల్స్ మీదుగా పార్లమెంట్ వైపునకు వెళ్లారు. ఈ సందర్భంగా రైల్ భవన్, పార్లమెంట్ సమీపాన ఉన్న ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా దగ్గర విద్యార్థులు, యువతపై ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ భాష్ప వాయువు(టియర్ గ్యాస్)ను ప్రయోగించింది. అనంతరం లాఠీచార్జ్ చేసి విద్యార్థులు, యువతపై తీవ్రంగా విరుచుకుపడ్డారు.

పార్లమెంట్ మెయిన్ గేట్ మూసివేత

సీజేపీ మార్చ్ పార్లమెంట్ సమీపానికి రావడంతో పార్లమెంట్ భద్రతా బలగాలు ఒక్క సారిగా అలర్ట్ అయ్యాయి. విజయ్ చౌక్ నుంచి పార్లమెంట్‌కు ఉపరాష్ట్రపతి, ప్రధాని, హోం మంత్రి, ఇతర మంత్రులు, ఎంపీలు వెళ్లే మెయిన్ గేట్‌కు పార్లమెంట్ భద్రతా సిబ్బంది తాళం వేశారు. ఈ గేటును దాటుకొని వస్తే అడ్డుకునేలా ఫైర్ ఇంజన్ పైపులను పోలే వాటర్ పైపులను సిద్ధం చేసుకున్నారు. పరిస్థితులు చేయి దాటితే తుపాకి కాల్పులు చేసేలా సీఐఎస్ఎఫ్ సిబ్బంది పొజిషన్ తీసుకున్నారు. ప్రెస్ క్లబ్ దగ్గర ఉద్రిక్తత ఏర్పడటంతో ఆ సమీపంలోని కేంద్ర ప్రభుత్వ ఆఫీసులను మూసి వేశారు. ఎవరినీ లోనికి రాకుండా భద్రతను పెంచారు.

## ఫిఫా ఫైనల్‌లో ట్రంప్‌కు ఊహించని అవమానం

**-స్పెయిన్ విజయోత్సవంలో ట్రంప్ ఓవర్ యాక్షన్?**
**-ట్రంప్‌ను స్టేజ్ నుంచి పక్కకు జరిపిన ఫిఫా చీఫ్!**
**-ప్రపంచం చూస్తుండగానే ట్రంప్‌కు షాక్..**



ఫిఫా

ఫిఫా పురుషుల ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ అట్టహాసంగా ముగిసిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్ కేవలం స్పెయిన్ విజయం వల్లే కాకుండా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఎదురైన చేదు అనుభవం కారణంగా కూడా ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. న్యూయార్క్--న్యూజెర్సీ స్టేడియంలో జరిగిన ట్రోఫీ ప్రదానోత్సవంలో ట్రంప్‌కు ప్రేక్షకుల నుంచి హూటింగ్ ఎదురుకావడం, అనంతరం ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినో ఆయనను స్టేజ్‌పై పక్కకు జరపడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. స్పెయిన్ ఫైనల్‌లో అర్జెంటీనాపై విజయం సాధించి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. మ్యాచ్ అనంతరం ట్రోఫీ ప్రదానోత్సవం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినో మైదానంలోకి అడుగుపెట్టగానే స్టేడియంలో ఉన్న కొందరు అభిమానులు పెద్ద ఎత్తున హూటింగ్ చేశారు. అయితే ఆటగాళ్లకు పతకాలు అందజేసే కార్యక్రమం ప్రారంభమైన తర్వాత ఆ హూటింగ్ క్రమంగా తగ్గిపోయింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రత్యేక హెలికాప్టర్‌లో స్టేడియానికి చేరుకుని ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించారు. ట్రోఫీ అందజేసిన అనంతరం కూడా ఆయన స్పెయిన్ ఆటగాళ్లతో కలిసి వేదికపై నిలచారు. అయితే స్పెయిన్ కెప్టెన్ రోడ్రీ ప్రపంచకప్ ట్రోఫీని ఎత్తి అభిమానులకు చూపే సమయంలో ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినో ట్రంప్‌ను వేదికపై ఒకవైపునకు జరిపిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈ ఘటనకు ముందు నుంచే ట్రంప్ ఫుట్‌బాల్ ప్రపంచంలో వివాదానికి కేంద్రబిందువయ్యారు. గ్రూప్ దశలో అమెరికా--బోస్నియా అండ్ హెర్జెగోవినా మ్యాచ్ సందర్భంగా అమెరికా స్ట్రైకర్ ఫోలారిన్ బలోగన్‌కు రెడ్ కార్డ్ చూపించడంపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అంతేకాకుండా ఆ నిర్ణయాన్ని మరోసారి సమీక్షించాలని ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినోకు నేరుగా ఫోన్ చేసినట్లు వార్తలు వచ్చాయి. ఒక దేశాధినేత ఆట నిబంధనలు, రిఫరీ నిర్ణయాల్లో నేరుగా జోక్యం చేసుకోవాలని ప్రయత్నించడం సరికాదంటూ ప్రపంచవ్యాప్తంగా పలువురు ఫుట్‌బాల్ నిపుణులు, అభిమానులు తీవ్ర విమర్శలు చేశారు. అదే వివాదం ప్రభావం ఫైనల్ ట్రోఫీ ప్రదానోత్సవంలోనూ కనిపించిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్‌నకు ఎదురైన హూటింగ్, స్టేజ్‌పై జరిగిన పరిణామాలు ప్రస్తుతం అంతర్జాతీయంగా హాట్ టాపిక్‌గా మారాయి.

## సెప్టెంబర్ 1 నుంచి బెంగాల్‌లో కొత్త రూల్

**-మాతృభాషకు బెంగాల్ సర్కారు పెద్దపీట**
**-సెప్టెంబరు 1 నుంచి ప్రభుత్వ పనులన్నీ బెంగాలీలోనే**
**-పౌర సేవలు, పోర్టళ్లు, పత్రాల్లో భాషా మార్పు**
**-కేంద్ర వ్యవహారాలకు హిందీ వినియోగం కొనసాగింపు**
**-భాషా విధానంపై కొత్త నిర్ణయం..**
**-మాతృ భాషకు పట్టం కట్టిన సీఎం సువేందు అధికారి!**




కొల్కతా

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం భాషా వినియోగంపై కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రజా సేవల్లో, అధికారిక సమాచార వ్యవస్థల్లో ఇకపై బెంగాలీ భాషను తప్పనిసరిగా ఉపయోగించాలని ముఖ్యమంత్రి సువేందు అధికారి తాజాగా ప్రకటించారు. ఈ కొత్త రూల్ 2026 సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వంతో అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాల కోసం హిందీని కూడా ఉపయోగించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. తాజాగా సీఎం వెల్లడించిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 1 నుంచి పౌర సేవలు, డిజిటల్ గవర్నెన్స్ వ్యవస్థలు, దరఖాస్తు ఫారాలు, ధ్రువపత్రాలు, ప్రభుత్వ పోర్టల్స్, వెబ్‌సైట్లు, మొబైల్ యాప్స్, శిక్షణా సామగ్రి, ప్రభుత్వ ప్రకటనలు, పబ్లిక్ సైన్‌బోర్డులు, అధికారిక సమాచార ప్రసారాలు వంటి అన్ని వేదికల్లో బెంగాలీ భాష వినియోగం తప్పనిసరి కానుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వ హయాంలో 2011లో జస్టిస్ సుశాంత భటర్జీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిషన్ నివేదికను విడుదల చేసినట్లు తెలిపారు. ఆ నివేదిక సిఫారసుల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. భూమి, భూ సంస్కరణల శాఖ నుంచి సీఎం కార్యాలయం వరకు ప్రభుత్వ వ్యవహారాలన్నీ బెంగాలీ భాషలోనే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే పౌర సేవలు, అఫిడవిట్లు, ప్రభుత్వ యాప్స్, పౌర పత్రాలు, ఎఫ్ఐఆర్‌లు, నోటిఫికేషన్లు వంటి అధికారిక పత్రాల్లో కూడా బెంగాలీ భాషనే వినియోగించనున్నట్లు తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ నిర్ణయం అమలుపై వారం రోజుల్లోగా నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. ఈ నిర్ణయానికి సంబంధించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాసిన లేఖను కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. పరిపాలన, విద్య, ప్రజా జీవితంలో భారతీయ భాషలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని, ప్రజల భాషలోనే పరిపాలన జరిగితే పాలన మరింత సమర్థవంతంగా, ప్రజాకేంద్రీకృతంగా ఉంటుందని డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ విశ్వసించారని అమిత్ షా ఈ లేఖలో పేర్కొన్న విషయాన్ని ఆయన చదివి వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం భాషా పరిరక్షణ దిశగా కీలక అడుగుగా భావిస్తున్నప్పటికీ, దీనిపై రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చ కొనసాగే అవకాశం కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## కాళేశ్వరం నీళ్లు సముద్రం పాలు

(మొదటి తరువాయి)

కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఒక 'చిచోరా'అని విమర్శించారు. ఆయనకు రైతులకు నీళ్లివ్వడం తెలియదనీ, ఢిల్లీకి మూటలు పంపడమే తెలుసని అన్నారు. ఎల్‌నినో వస్తుందని శాస్త్రవేత్తలు ఆర్నెల్ల ముందే హెచ్చరించినా ప్రభుత్వం స్పందించలేదని చెప్పారు. ప్రభుత్వం ఇప్పుడు సమావేశాలు పెడితే ప్రయోజనం ఏంటని ప్రశ్నించారు. రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా కొరత, విద్యుత్ సమస్యలు, ధాన్యం కొనుగోలు ఇబ్బందులు, సాగునీటి కొరత వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతుల కోసం రక్తం ఇవ్వడానికైనా తాము సిద్ధమని ప్రకటించారు. 70 వేల ఉద్యోగాల భర్తీపై తన సవాల్‌ను స్వీకరించే దమ్ము రేవంత్‌రెడ్డికి ఉందా?అని ప్రశ్నించారు. 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు రుజువు చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. బాన్సువాడ ప్రజలు గులాబీ జెండాను ఎగరేసి పోచారం శ్రీనివాస్ రెడ్డిని విశ్వసించి గెలిపించారనీ, ఆయన ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోలేకపోయారని అన్నారు. గాచారం బాగాలేకనే పోచారం వేరే దానికి పోయిండన్నారు. రానున్న ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఓడించడమే బీఆర్‌ఎస్ కార్యకర్తల లక్ష్యంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా రైతులకు నీళ్లు అందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నీటిని వృథాగా సముద్రంలోకి వదులుతోందని ఆరోపించారు. "ఇక్కడ నీళ్లు లేవంటారు. కానీ అదే నీళ్లు కిందకు వెళ్లి ఆంధ్రప్రదేశ్‌లో మోటార్లు నడుస్తున్నాయి. వరంగల్‌లో దేవాదుల, ఖమ్మంలో సీతారామ ప్రాజెక్టులు నడుస్తున్నాయి. అక్కడ నీళ్లు ఉంటే ఇక్కడ ఎందుకు లేవు?" అని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రాణాలైనా ఇస్తామనీ, రైతుల కోసం రక్తం ఇవ్వడానికైనా సిద్ధమనీ, పంటలను ఎండబెట్టే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అమలు కావడం లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలూ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. మోరిల్ శ్రీనివాస్ బీఆర్‌ఎస్‌లో చేరడంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హనుమంత్ షిండే, జీవన్ రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ?

## తెలంగాణ ఆర్టీసీ
## పేద ప్రజలకు జీవనాడి

(మొదటి తరువాయి)



కుమార్తె శాలిని చెక్కును స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు అండగా నిలవడం అభినందనీయమని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న ప్రతి నెలా ఆర్టీసీకి రూ.300 కోట్లు విడుదల చేస్తున్నామని తెలిపారు. సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల సౌకర్యం, కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ మూడు ప్రధాన లక్ష్యాలని స్పష్టం చేశారు. ఆర్టీసీని మెట్రో, ఎంఎంటీఎస్ సేవలతో అనుసంధానం చేస్తూ గ్రామాల నుంచి రాజధాని వరకు కొత్త బస్సు మార్గాలను ప్రారంభిస్తామని చెప్పారు. క్యూర్ ఏరియా పరిధిలో ఆధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రిటైర్డ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, సంస్థ అభివృద్ధికి ఉద్యోగులంతా మరింత బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రూ. 6 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు కూడా ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. శంకర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో స్వయంగా పరామర్శించమని గుర్తుచేస్తూ, ఆయన కుమారుడు హేమంత్‌కు ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తామని, కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని ప్రకటించారు. ఎన్నికల అనంతర ఆర్టీసీ విలీన ప్రక్రియను కూడా ప్రారంభిస్తామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ఆర్టీసీ పేద ప్రజలకు జీవనాడిని నిలుస్తోందని, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## కాంగోలో వేగంగా వ్యాపిస్తున్న ఎబోలా..

**-930 దాటిన మృతుల సంఖ్య..!**



**న్యూఢిల్లీ -- 20 జూలై (జర్నలిస్ట్ డైరీ) :** మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. మే 15 నుంచి శనివారం నాటికి దేశవ్యాప్తంగా 2,344 కేసులు నమోదు కాగా.. దాదాపు 930 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ ఆరోగ్యశాఖ తాజాగా వెల్లడించింది. శుక్రవారం నుంచి 24 గంటల వ్యవధిలో 37 మరణాలు నమోదైనట్లు తెలిపింది. ప్రస్తుతం కాంగోలో నమోదవుతున్న కేసులన్నీ బుండిబుగ్యో ఎబోలా రకానివే. ఈ తరహా కేసులు నమోదవుతున్నట్లు మే 15న అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. ఈ వైరస్‌ను అరికట్టేందుకు ప్రస్తుతం వ్యాక్సిన్ గానీ, చికిత్స గానీ అందుబాటులో లేవు. సాధారణంగా ఎబోలా వైరస్ జంతువులు, గబ్బిలాలకు సోకుతుంది. అది సోకిన జంతువులను వేటాడి వాటి మాంసం (బుష్‌మీట్) తినడంవల్ల మనుషులకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధి లక్షణాలు కనిపించడానికి 21 రోజులు పడుతుంది. ఫ్లూ, మలేరియా, జ్వరం వంటి లక్షణాలు తొలుత కనిపించినా.. చివరకు అవయవాల వైఫల్యానికి దారితీసే ప్రమాదం ఉంది. ఈ వైరస్ సోకిన వ్యక్తుల కొన్ని కేసుల్లో శరీరం లోపలా, బయటా రక్తస్రావం అవుతుంది. వైరస్ బారినపడిన వ్యక్తి శరీర ద్రవాల ద్వారా ఇది ఇతరులకూ వ్యాపిస్తుంది.


## జమ్మూ-కాశ్మీర్‌లో ముగిసిన సమ్మర్ హాలిడేస్..

**-స్కూల్స్ ప్రారంభం ఎప్పటినుంచంటే**



**న్యూఢిల్లీ - 20 జూలై (జర్నలిస్ట్ డైరీ) :** జమ్మూ-కాశ్మీర్‌లో వేసవి సెలవులు ముగిశాయి. ఈ నెల 22 నుంచి స్కూల్స్ ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జమ్మూ కాశ్మీర్ విద్యాశాఖ తాజాగా ప్రకటన చేసింది. ఈ నిర్ణయం కాశ్మీర్ డివిజన్‌లోని వింటర్ జోన్ పాఠశాలలతోపాటు, జమ్మూ డివిజన్‌లోని పాఠశాలలకు కూడా వర్తిస్తుంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఈ నెల 22 నుంచి తిరిగి ప్రారంభమవుతాయని ప్రభుత్వం ప్రకటించింది. నిజానికి జమ్మూ కాశ్మీర్‌లో ఇప్పటికే పాఠశాలలు ప్రారంభం కావాలి.కానీ, వేసవి తాపం, భారీ ఎండల నేపథ్యంలో ప్రభుత్వం వేసవి సెలవుల్ని పొడిగించింది. సాధారణంగా జూలై 6 వరకు అక్కడ వేసవి కాలం ముగుస్తుంది. కానీ, ఈసారి ఎండలు మరింత ఎక్కువగా ఉన్నాయి. భారీగా నమోదైన ఉష్ణోగ్రతలు, వడగాల్పుల ప్రభావం కారణంగా వేసవి సెలవుల్ని పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఈ రోజు నుంచే పాఠశాలలు ప్రారంభమవుతాయని గతవారం ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఇంకా అక్కడ వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో మరో రెండు రోజులు సెలవుల్ని పొడిగించింది. దీంతో బుధవారం, జూలై 22 నుంచి స్కూల్స్ ప్రారంభమవుతాయని జమ్మూ కాశ్మీర్ విద్యాశాఖ మంత్రి సకినా ఇట్టూ తన సోషల్ మీడియా ఖాతాలో వెల్లడించారు. మరోవైపు దేశమంతా ఇప్పటికే సమ్మర్ హాలిడేస్ ముగిసి, విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. గత నెలలోనే స్కూల్స్ రీఓపెన్ అయ్యాయి. అయితే, కాశ్మీర్ వాతావరణ పరిస్థితులు వేరుగా ఉండటం వల్ల అక్కడ స్కూళ్లు ఆలస్యంగా ప్రారంభమవుతాయి. ప్రస్తుతం అక్కడ అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే.

## చార్‌ధామ్ యాత్ర తాత్కాలికంగా నిలిపివేత



**న్యూఢిల్లీ 20 జూలై (జర్నలిస్ట్ డైరీ)** చార్‌ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం, వాతావరణ శాఖ రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లు జారీ చేయడంతో యాత్రికుల భద్రత దృష్ట్యా ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. చార్‌ధామ్ మార్గంలో కురుస్తున్న భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడుతుండటంతోచార్ ధామ్ యాత్రను సోమవారం (జూలై 20, 2026) తాత్కాలికంగా నిలిపివేశామని అని అధికారులు తెలిపారు.ప్రతికూల వాతావరణం దృష్ట్యా ఏ యాత్రికుడిని ముందుకు వెళ్లనివ్వకుండా చూడాలని స్థానిక అధికారులను యంత్రాంగం ఆదేశించింది. కేదార్‌నాథ్, బద్రీనాథ్, యమునోత్రి, గంగోత్రిలకు వెళ్లే చార్‌ధామ్ యాత్ర ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభమైన విషయం తెలిసిందే.

## త్రిపుర డీజీపీ అనుమానాస్పద మృతి



**న్యూఢిల్లీ - 20 జూలై (జర్నలిస్ట్ డైరీ) :** త్రిపుర డీజీపీ అనురాగ్ ధన్‌ఖడ్ అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందారు. అగర్తలాలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సోమవారం ఆయన గన్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. గమనించిన సిబ్బంది వెంటనే ఆయన్ని అగర్తలాలోని గోవింద్ బల్లభ్ పంత్ ఆసుపత్రికి తరలించారు. పోలీసు ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆయన మరణానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై పోలీసులు ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు.

# అమెరికా అంతదాకా వస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయ్

**-ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్**

**న్యూఢిల్లీ - 20 జూలై (జర్నలిస్ట్ డైరీ) :** అగ్రరాజ్యం అమెరికా భూతల దాడికి దిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసినా గట్టిగా బదులిస్తామని స్పష్టంచేసింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ.. అమెరికాతో కుదిరిన అవగాహనా ఒప్పందం స్పష్టంగా ఉందని, అందులో ఎలాంటి సందిగ్ధత లేదని అన్నారు.ఒప్పందం చిన్నదే అయినా మొత్తం 14 క్లాజ్‌లు ఉన్నాయని ఇస్మాయిల్ బఘాయి చెప్పారు.




హర్మూజ్ జలసంధి భవిష్యత్ నిర్వహణ బాధ్యత ఇరాన్‌కే చెందుతుందని, ఈ అంశాన్ని ఒమన్‌తోపాటు ప్రాంతీయ దేశాలతో చర్చిస్తూ ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఒప్పందంలోని నిబంధనలు స్పష్టంగా ఉన్నందున, దాన్ని ఉల్లంఘించడానికి అమెరికాకు ఎలాంటి అవకాశం లేదని తెలిపారు. ఇదిలావుంటే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై సైనిక చర్యలు విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే సైనిక సామర్థ్యం అమెరికాకు ఉన్నప్పటికీ.. దాన్ని ఎక్కువ రోజులు ఆధీనంలో ఉంచుకోవడం అంత సులభం కాదని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ ఆక్రమణకు దిగితే ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బుషెహర్ ప్రావిన్స్ తీరానికి 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపం ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఇరాన్ చమురు ఎగుమతుల్లో సుమారు 90 శాతం ఈ ద్వీపం నుంచే జరుగుతుంది.

## ఎల్పీజీ స్థానంలో వంటగ్యాస్‌గా ఇథనాల్..

**- కొత్త పాలసీ తీసుకురానున్న కేంద్రం**

**న్యూఢిల్లీ - - 20 జూలై (జర్నలిస్ట్ డైరీ) :** ఎల్పీజీ సిలిండర్లు లేని భారతీయ ఇండ్లు చాలా అరుదు. ప్రతి ఇంట్లో వంట కోసం ఎల్పీజీ వినియోగిస్తున్న రోజులివి. అయితే, త్వరలో ఎల్పీజీని ఇథనాల్ రీప్లేస్ చేయబోతుంది. ఇప్పటికే వాహనాల్లో ఇథనాల్ కలిసిన పెట్రోల్ అందుబాటులోకిరాగా.. త్వరలో డీజిల్ కూడా వినియోగంలోకి రానుంది. ఇది పూర్తయ్యేలోపు ఎల్పీజీ స్థానంలో ఇథనాల్‌ను వంటగ్యాస్‌గా ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ అవుతోంది. లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ)కి ప్రత్యామ్నాయంగా ఇథనాల్ ఆధారిత వంటగ్యాస్‌ను కేంద్రం తీసుకురానున్నట్లు సమాచారం. దీనిపై ఇప్పటికే కేంద్ర పెట్రోలియం, చమురు మంత్రిత్వశాఖ కసరత్తులు ప్రారంభించింది. ఇథనాల్ ఉత్పత్తి, ఇథనాల్‌పై సబ్సిడీ, సరఫరా వంటి అంశాలపై కేంద్రం అధ్యయనం చేస్తోంది. దేశంలో ప్రస్తుతం



వినియోగంలో ఉన్న చమురు స్థానంలో ఇథనాల్‌ను ప్రవేశపెట్టబోతుంది. ఈ అంశంలో చమురు ఉత్పత్తి, సరఫరా సంస్థలతో కూడా కేంద్రం సంప్రదింపులు జరుపుతోంది. ఇక, ఎల్పీజీ స్థానంలో ఇథనాల్‌పై సెప్టెంబర్‌లోపు ఒక పాలసీని కేంద్రం రూపొందించనుంది. ఇది అమలులోకి వస్తే ఎల్పీజీ బదులు ఇథనాల్‌తోనే వంట చేసుకోవచ్చు. ఎల్పీజీ నుంచి వినియోగదారులు ఇథనాల్‌వైపు మారితే వారికి సబ్సిడీ కూడా ఇవ్వాలని కేంద్రం భావిస్తోంది. భారీ సరఫరా, పంపిణీ వ్యవస్థను కూడా అందుబాటులోకి తేవాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. దేశంలో ఇప్పటికి ఇథనాల్ ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం లేదు. మన అవసరాలకంటే ఎక్కువే ఇథనాల్ ఉత్పత్తి చేయగల సామర్థ్యం మన సంస్థలకు ఉంది. ఇప్పటికే దేశంలో ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి 20 బిలియన్ లీటర్లకంటే ఎక్కువే ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనే మరో 4 బిలియన్ లీటర్ల ఉత్పత్తి సామర్థ్యం పెరగనుంది. ఈ మొత్తంలో ప్రభుత్వం లక్ష్యమైన ఈ20 పెట్రోల్ కోసం 11 బిలియన్ లీటర్ల ఇథనాల్ వినియోగం అవుతోంది. మిగిలిన దాంట్లో 3-3.5 బిలియన్ లీటర్ల వరకు ఇథనాల్‌ను ఫార్మా సంస్థలు, లిక్కర్ సంస్తలు, కెమికల్ సంస్థలు వాడుతున్నాయి. ఇంకా ఏడు బిలియన్ లీటర్ల వరకు ఇథనాల్ మిగిలిపోతోంది. దీంతో ఈ ఇథనాల్‌ను వంట గ్యాస్‌గా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో చమురు సంస్థలు ఇప్పటికే పరీక్షలు జరుగుతున్నాయి. ఇవి పూర్తిస్థాయిలో సఫలమైతే ఇథనాల్ కుకింగ్ గ్యాస్ అందుబాటులోకి వస్తుంది.

# దేశంలోకి తొలి డెంగీ వ్యాక్సిన్..

**అనుమతించిన ప్రభుత్వం..**

**ఎవరు తీసుకోవచ్చు..**

**న్యూఢిల్లీ - 20 జూలై (జర్నలిస్ట్ డైరీ) :** దేశంలో ఎక్కువ మంది అనారోగ్యానికి కారణమయ్యే వాటిలో డెంగీ ఒకటి. డెంగీ సోకిన వారు కొన్నిసార్లు ప్రాణాలు కూడా కోల్పోవచ్చు. అంతేకాదు.. దీని చికిత్స కోసం భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే, ఇకపై ఈ ఇబ్బందులు తప్పబోతున్నాయి. ఎందుకంటే దేశంలో డెంగీ సోకకుండా ఉండే వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. జపాన్ సంస్థ తయారు చేసిన డెంగీ వ్యాక్సిన్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి లభించింది. దీంతో త్వరలోనే ఈ వ్యాక్సిన్ బహిరంగ మార్కెట్లోకి అందుబాటులోకి రానుంది.జపాన్‌కు చెందిన తకేడా అనే బయోఫార్మా సంస్థ క్యూడెంగా పేరుతో డెంగీ వ్యాక్సిన్‌ను దేశంలో అందుబాటులోకి తెచ్చింది. దీనికి డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) అనుమతించింది. మార్కెట్లోకి రానున్న ఈ వ్యాక్సిన్‌ను 4-60 సంవత్సరాల వయసున్న ఎవరైనా తీసుకోవచ్చు. గతంలో డెంగీ




సోకినవారైనా, ఇప్పటివరకు డెంగీ సోకకున్నా కూడా ఈ వ్యాక్సిన్ తీసుకోవచ్చు. ఇప్పటికే కొన్ని డెంగీ వ్యాక్సిన్‌లు అంతర్జాతీయ మార్కెట్లో ఉన్నాయి. అయితే, అవి తీసుకోవాలంటే ముందుగా ప్రీ వ్యాక్సినేషన్ స్క్రీనింగ్ టెస్టు అవసరం. ఆ టెస్టులో పాసైతేనే వ్యాక్సిన్ తీసుకోవచ్చు. లేదంటే వ్యాక్సిన్ తీసుకోవడం కుదరదు. అయితే, జపాన్ సంస్థ రూపొందించిన క్యూడెంగా వ్యాక్సిన్‌కు మాత్రం ఇలాంటి టెస్టులు అవసరం లేదు. ఎవరైనా దీన్ని తీసుకోవచ్చు. ఇది రెండు డోసుల్లో తీసుకోవాలి. ప్రతిసారి 0.5 ఎంఎల్ ఇంజెక్షన్స్ రూపంలో తీసుకోవాలి. మొదటి డోస్ తీసుకున్న మూడు నెలల తర్వాత రెండో డోస్ తీసుకోవాలి. ఈ వ్యాక్సిన్ దేశంలో ఎక్కువగా వ్యాపిస్తున్న నాలుగు రకాల డెంగీ వ్యాధులను నివారించగలదు. ఈ వ్యాక్సిన్ ఇప్పుడు అనేక దేశాల్లో అందుబాటులో ఉంది. ఇందుకోసం 19 దశల పరీక్షలు పూర్తయ్యాయి. వాటిలో ఫేజ్ 1, 2, 3 క్లినికల్ ట్రయల్స్ కూడా ఉన్నాయి. ఇందులో 28,000 మంది పాల్గొన్నారు. ఇండియాతో సహా అనేక దేశాల్లో ఈ వ్యాక్సిన్ పనితీరు, రక్షణ, దుష్ప్రభావాలు వంటి వాటిని పరిశీలించారు. ఏడేళ్లుగా ఈ వ్యాక్సిన్.. డెంగీ నుంచి రక్షిస్తున్నట్లు అధ్యయనం చెబుతోంది. 2022లో ఇది మార్కెట్లోకి రాగా.. 43 దేశాల్లో వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు 3.2 కోట్ల డోసుల వ్యాక్సిన్ తీసుకున్నారు. ఇండియాలో ఈ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగపడుతుంది. ఎందుకంటే దేశంలో డెంగీ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దోమల ద్వారా సంక్రమించే ఈ వ్యాధి ప్రాణాంతకంగా మారే ఛాన్స్ ఉంది. సరైన సమయంలో చికిత్స తీసుకోకుంటే భారీ నష్టం తప్పదు. అందుకే ఈ వ్యాక్సిన్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే డెంగీ వ్యాధి బాధితుల సంఖ్య తగ్గుతుంది.

# దేశంలో ప్రతి 10 మందిలో 9 మందికి రక్తంలో కొవ్వు సమస్య..

**ఐసీఎంఆర్ అధ్యయనంలో వెల్లడి**

**న్యూఢిల్లీ - 20 జూలై (జర్నలిస్ట్ డైరీ) :** భారతీయుల ఆరోగ్యంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్-ఇండియా డయాబెటిస్ నిర్వహించిన జాతీయస్థాయి అధ్యయనంలో కొన్ని ఆందోళనకరమైన విషయాలు వెల్లడయ్యాయి. దేశంలో ప్రతి 10 మంది వయోజనుల్లో దాదాపు తొమ్మిది మంది (87.3%) ఏదో ఒక రకమైన 'డైస్లిపిడెమియా ' తో బాధపడుతున్నారని ఈ సర్వే తేల్చింది. డైస్లిపిడెమియా అంటే రక్తంలో కొవ్వుల (లిపిడ్స్) నిష్పత్తి అసాధారణంగా ఉండటం. సాధారణ భాషలో చెప్పాలంటే చెడు కొలెస్ట్రాల్ లేదా ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువగా ఉండటం, మంచి కొలెస్ట్రాల్ తక్కువగా ఉండటం. ఈ సమస్య గుండె జబ్బులు, గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు ప్రధాన కారణమవుతుంది.ప్రఖ్యాత 'జర్నల్ ఆఫ్ క్లినికల్ లిపిడాలజీ' లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం దేశవ్యాప్తంగా 23,665 మంది నుంచి శాంపిల్స్ సేకరించి విశ్లేషించారు. కొలెస్ట్రాల్ సమస్య అనేది కొద్దిమందికి మాత్రమే పరిమితమైనది కాదని, ఇది దేశవ్యాప్తంగా సర్వసాధారణ ఆరోగ్య సమస్యగా మారిపోయిందని ఈ సర్వే ఫలితాలు స్పష్టంచేశాయి.




ఈ అధ్యయనంలో మరికొన్ని కీలక విషయాలు కూడా వెల్లడయ్యాయి. ఈ అధ్యయనం ప్రకారం.. కొలెస్ట్రాల్ సమస్య కేవలం పట్టణ ప్రాంతాలకే పరిమితం కాలేదు. పట్టణాల్లో 89% మంది ఈ సమస్యతో బాధపడుతుంటే, గ్రామీణ ప్రాంతాల్లోనూ 86.5% మంది దీని బారినపడ్డారు. అంటే జీవనశైలితో సంబంధం లేకుండా ఈ ముప్పు విస్తరిస్తోందని అర్థమవుతోంది. ఇక లింగాల వారీగా చూస్తే పురుషుల (83.5%) కంటే మహిళల్లోనే (91.1%) ఈ సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. భారతీయుల్లో అత్యంత సాధారణంగా కనిపించే సమస్య మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) తక్కువగా ఉండటమేనని, జనాభాలో 66.8% మంది ఈ సమస్యతో బాధపడుతున్నారని నివేదిక పేర్కొన్నది. అధ్యయనంలో అత్యంత ఆందోళన కలిగించే అంశం యువతపై దీని ప్రభావం. పాశ్చాత్య దేశాల్లో 50-60 ఏళ్ల వయసులో కొలెస్ట్రాల్ సమస్యలు తీవ్రమవుతుండగా, భారతదేశంలో కేవలం 30-39 ఏళ్ల వయసులోనే ఇది గరిష్ఠ స్థాయికి చేరుకుంటోంది. అంటే దేశానికి కీలకమైన యువత పనిచేసే వయసులోనే గుండె జబ్బుల ముప్పును ఎదుర్కొంటున్నారని తాజా సర్వే హెచ్చరిస్తోంది. ఈ సర్వేలో మరో షాకింగ్ విషయం బయటపడింది. ఎలాంటి డయాబెటిస్, అధిక రక్తపోటు, ఊబకాయం లేని, ఆరోగ్యంగా ఉన్నామని భావించే వారిలో కూడా 40 శాతం మందికి అసాధారణ లిపిడ్ ప్రొఫైల్ ఉన్నట్లు తేలింది. దీన్నిబట్టి పైకి ఆరోగ్యంగా కనిపించినంత మాత్రాన గుండె జబ్బుల ముప్పు లేదని భావించడానికి వీల్లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మధుమేహం, ఊబకాయం ఉన్నవారిలో ఈ ముప్పు మరింత ఎక్కువగా ఉందని కూడా అధ్యయనం పేర్కొన్నది. ఈ నేపథ్యంలో కేవలం ఆనారోగ్య సమస్యలతో ఉన్నవారికి, వయోజనులకు మాత్రమే కాకుండా.. చిన్న వయసు నుంచే అందరికీ లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉందని ఈ స్టడీ గట్టిగా సిఫార్సు చేస్తోంది. రెగ్యులర్‌గా కొలెస్ట్రాల్ స్థాయిలను చెక్ చేసుకోవడం ద్వారా ముప్పును ముందుగానే గుర్తించి, జీవనశైలి మార్పులు, అవసరమైన చికిత్సతో తీవ్రమైన గుండె జబ్బుల నుంచి తమను తాము కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ జీవో 641 వెంటనే రద్దు చేయాలి

**- షాద్ నగర్ సీపీఐ నేత బుద్ధుల జంగయ్య**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 20 (జర్నలిస్ట్ డైరీ) :** సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 641ను వెంటనే రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్ధుల జంగయ్య డిమాండ్ చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మండల కార్యదర్శులు, ముఖ్య నాయకులతో కలిసి దేవీ గ్రాండ్ హోటల్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ, కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామ శివారులో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ వల్ల పరిసర గ్రామాలు, గిరిజన తండాల ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. డంపింగ్ యార్డ్ నుంచి వెలువడే కాలుష్యం ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని, వర్షాకాలంలో అక్కడి నుంచి ప్రవహించే కలుషిత నీరు హిమాయత్ సాగర్‌లో కలవడం వల్ల తాగునీరు, సాగునీరు కూడా ప్రభావితమై ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో నెం.641 షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్‌కు తెలియకుండా జారీ అయ్యిందా అని ప్రశ్నించారు. జీవో రాకముందే అడ్డుకోవాల్సిందిపోయి, ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు పోరాటాలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి జీవో రద్దు చేయించాలని, ప్రజలను సమీకరించి రాజకీయాలు చేయడం సరికాదన్నారు. షాద్‌నగర్ హైదరాబాద్‌కు అత్యంత సమీపంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల భవిష్యత్ తరాలు కూడా తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కాలుష్య ప్రభావంతో పుట్టబోయే శిశువుల ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలను సీపీఐ స్వాగతిస్తుందని, అయితే ప్రజలకు నష్టం కలిగించే నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం కూడా సిద్దాపూర్ పరిధిలో ఎస్సీ, ఎస్టీల భూములను సేకరించి పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదించిందని, అప్పుడూ సీపీఐ వ్యతిరేకించిందని గుర్తు చేశారు. కాలుష్య రహిత పరిశ్రమలను స్వాగతిస్తామని, కానీ కాలుష్యానికి కారణమయ్యే పరిశ్రమలు లేదా డంపింగ్ యార్డులను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయకూడదని డిమాండ్ చేశారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ముందుకు రావడం హేయమైన చర్య అని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే జీవో నెం.641ను రద్దు చేయాలని, లేకపోతే సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ కొత్తూరు మండల కార్యదర్శి ఎండి షకీల్, కేశంపేట మండల కార్యదర్శి గోవిందు నాయక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్, జిల్లేడు చౌదరిగూడ మండల కార్యదర్శి జిల్లెల్ల వెంకటేష్, కొందుర్గు మండల కార్యదర్శి భాగాళ నరసింహ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు ఆకాష్ నాయక్, ఎండి మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు విధానం,అర్హతలు, విధివిధానాలు తెలియచేసే బ్రోచర్ విడుదల

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 20 ( జర్నలిస్ట్ డైరీ) :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మొదట విడతగా హైదరాబాద్ క్యూర్ పరిధిలోని ఇళ్లు లేని పేదలందరికి 1 లక్ష ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసే గొప్ప కార్యక్రమానికి ఈ రోజు బోనాల పండుగ సమయం పవిత్ర ఆషాడ మాసంలోడా. బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, క్యూర్ పరిధిలోని 16 నియోజకవర్గాల శాసనసభ్యులు, ఎమ్మెల్సీ లు అధికారుల సమక్షంలో శ్రీకారం చుట్టడం జరిగినది. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు విధానం, అర్హతలు, విధివిధానాలు తెలియచేసే బ్రోచర్‌ను విడుదల కార్యక్రమంలో పాల్గొన్న పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.
ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ...
మహానగరం హైదారాబాద్ లో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు రేపటి నుండి శ్రీకారం క్యూర్ పరిధిలో లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ.గ్రామం నుంచి మహానగరం వరకు ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పిస్తాం పేదల సొంతింటి కలలను సాకారం చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ సంకల్పం. అని ్రాూజ చైర్మన్ గాంధీ గారు తెలియచేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో 1 లక్ష ఇండ్లు కలిపి మొత్తం 3.50 లక్షల కొత్త ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నాం. గత ఏడాది మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షలకు పైగా పేద కుటుంబాల జీవితాల్లో సొంతింటి వెలుగులు నింపుతూ ప్రజా ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోంది. రాష్ట్రం లో పేదవాడి సొంతింటి కల నెరవేరే వరకు ఇందిరమ్మ ఇళ్ల యజ్ఞం నిరంతరంగా కొనసాగుతుంది. ఇది ఒకసారి చేపట్టి ముగించే కార్యక్రమం కాదు అని. రాష్ట్రంలో గూడు లేని ప్రతి అర్హులైన నిరుపేద కుటుంబానికి చివరి లబ్ధిదారుని వరకు గౌరవప్రదమైన సొంతింటిని నిర్మించి అందించే వరకు ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుంది అని తెలియచేశారు.
ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారించిన ప్రభుత్వం, ఇప్పుడు హైదరాబాద్ నగరంతో పాటు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదల సొంతింటి కలను కూడా నిజం చేయడానికి శ్రీకారం చుట్టడం జరిగినది అని,పేదల ఇళ్ల కోసం నగరంలో కోట్ల రూపాయల విలువైన అత్యంత కీలక ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించింది, ఆయా ప్రాంతాలలో స్థానిక పరిస్థితులను బట్టి ఒక ఎకరా నుండి ఐదు ఎకరాల వరకు స్థలాలను సేకరించింది.అధునాతన సౌకర్యాలతో బహుళ అంతస్తుల (పది అంతస్తుల వరకు) భవనాల నిర్మాణం చేపట్టి, ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన జీవనం కల్పిస్తుంది ప్రజా ప్రభుత్వం.
ప్రతి నియోజకవర్గాన్ని ప్రత్యేక యూనిట్‌గా తీసుకుని అమలు చేస్తున్న ఈ పథకంలో ఆ నియోజకవర్గ ప్రజలు అదే నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నాను. అని తెలియచేశారు.
మన శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గచ్చిబౌలి ,అంజయ్య నగర్,లలో నిర్మించిన 9 టవర్లలో నిర్మించడం జరిగిందినని మన నియోజకవర్గంలో 1080 ఇండ్లు నిర్మించడం జరుగుతుంది అని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందచేస్తామని, ఇదొక సువర్ణ అవకాశం అని తెలియచేశారు.క్యూర్ పరిధిలో నివాసముంటున్న ప్రాంతాలకు సమీపంలోనే పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాల్లో మొదటగా నియోకవర్గానికి 500 చొప్పున అల్పదాయ (LIG) వర్గాల ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుంది.
పూర్తి పారదర్శకత కోసం ఎటువంటి పైరవీలకు తావు లేకుండా కేవలం ఆన్లైన్ పద్దతిలోనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుంది.
ఆడబిడ్డలను యజమానిగా చేస్తూ వారి పేరు మీదనే పట్టాను అందించి, మహిళలకు సొంతింటిపై హక్కు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు వారి సాధికారతకు బలమైన పునాది పడింది. తెలంగాణ ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల సొంతింటి కలను సాకారం చేసే ఇందిరమ్మ ఇండ్ల పథకం దేశ చరిత్రలోనే చిరస్థాయిగా మిగిలిపోతుంది. అని తెలియచేశారు.

# తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

**-ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంది వెంకట్రామ రెడ్డి**
**-ఉద్యమకారుల కమిటీ సభ్యుడు రాములు నాయక్‌కు వినతిపత్రం**
**-ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 20 (జర్నలిస్ట్ డైరీ) :** తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రంగారెడ్డి జిల్లా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంది వెంకట్రామ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల కమిటీ సభ్యుడు రాములు నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, జాంగారి నర్సింలు, ఆనందీశ్వర రెడ్డి, రవిగౌడ్, వెంకటేష్, వాహెద్ తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు. వినతిపత్రంలో వారు ప్రధానంగా ఈ డిమాండ్లను ప్రస్తావించారు. నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ అమరవీరుల స్థూపంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, తెలంగాణ ఉద్యమకారులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు.అలాగే ఉద్యమకారుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం కేటాయించడంతో పాటు గౌరవ భృతి చెల్లించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఉద్యమకారులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని, ముఖ్యంగా తెలంగాణ ఉద్యమకారులకు తగిన గౌరవం, గుర్తింపు కల్పించాలని వినతిపత్రంలో కోరారు.

## కొడంగల్ లో సీఎం పర్యటన నేపథ్యంలో అలర్ట్ అయిన అధికారులు

**- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు కలెక్టర్ దీపక్ తీవారి**



**జర్నలిస్ట్ డైరీ కొడంగల్ జులై 20:-** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మంగళవారం కొడంగల్ నియోజక వర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఒక్కసారిగా హై అలర్ట్ అయింది.కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం హకీంపేట్ గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్' పనులను సీఎం క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు.ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహరా కలిసి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు.పర్యటన స్థలాలు భద్రతా ఏర్పాట్లను అంగుళం అంగుళం జల్లెడ పడుతూ అధికారులకు దిశానిర్దేశం చేశారు.కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడ) పరిధిలో జరుగుతున్న వివిధ ప్రగతి పనులను ముఖ్యమంత్రి స్వయంగా సమీక్షించనున్నారని ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉన్నా సహించేది లేదని అధికారులు హెచ్చరించారు.ముఖ్యంగా హెలిప్యాడ్ నిర్మాణం ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మొత్తం 9 బ్లాక్‌లలో పటిష్టమైన బారికేడ్లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.సీఎం సెక్యూరిటీ ప్రోటోకాల్ ప్రకారం భద్రతా ప్రమాణాల్లో ఎలాంటి రాజీ పడొద్దని ఎస్పీ స్నేహ మెహరా పోలీస్ అధికారులను ఆదేశించారు.పర్యటనను అత్యంత విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు 24 గంటలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఎస్పీ స్పష్టం చేశారు.ఈ భద్రతా ఏర్పాట్ల పరిశీలన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా డీఎస్పీ శ్రీనివాస్ కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై ఉన్న వ్యాపార డబ్బాలు, అక్రమ నిర్మాణాలు తొలగించాలని గ్రామపంచాయతీకి వినతిపత్రం



**యాచారం.(జులై 20) జర్నలిస్ట్ డైరీ..** కొత్తపల్లి గ్రామంలో రోడ్లపై ఏర్పాటు చేసిన వివిధ వ్యాపార డబ్బాలు, అక్రమ నిర్మాణాలు ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో వాటిని వెంటనే తొలగించాలని గ్రామ సర్పంచ్ చిక్కుడు వెన్నెల శేఖర్, ఉప సర్పంచ్ కాలే అనిత రమేష్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రజల భద్రతకు భంగం కలిగిస్తున్న అక్రమ నిర్మాణాలు, రహదారులపై ఉన్న వ్యాపార డబ్బాలను తక్షణమే తొలగించి గ్రామంలో సురక్షితమైన, స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుకూల వాతావరణం కల్పించాలని కోరారు. అలాగే వ్యాపార డబ్బాల యజమానులు, గ్రామ ప్రజలు గ్రామాభివృద్ధి దృష్ట్యా గ్రామపంచాయతీకి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తలారి సత్యనారాయణ, వంగ సంజీవరెడ్డి, పోలే శివ, కంబాలపల్లి కుమార్, చిక్కుడు పావని, మహేశ్వరం వినోద, కె.రాజు, పోలే శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

## నర్సప్పగూడలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 20 (జర్నలిస్ట్ డైరీ) :** నందిగామ, జూలై 20: నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సప్పగూడ గ్రామంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో గ్రామ సర్పంచ్ కోడిచెర్ల రాజేశ్వరి ఆధ్వర్యంలో నందిగామ ఎస్సై దేవరాజ్ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామస్థులకు మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ, పోక్సో చట్టం (ూజూూ) ద్వారా చిన్నారుల రక్షణ, అలాగే భూ వివాదాల నివారణ సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులకు బ్యాంకు వివరాలు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దని సూచించారు. మాదకద్రవ్యాలకు యువత పూర్తిగా దూరంగా ఉండాలని, రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, చిన్నారుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, విపివో రాజశేఖర్, హెచ్‌సి లక్ష్మీపతి, హెచ్‌సి వెంకట్ నాయక్, పిసి శ్రీశైలం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేద్దాం

**- జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ భూపాల్ గౌడ్**

**- ఈనెల 24న షాద్‌నగర్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం**





**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 20 (జర్నలిస్ట్ డైరీ) :** ఈనెల 24వ తేదీన జరగనున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ భూపాల్ గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. షాద్‌నగర్ పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో సోమవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కక్కునూరు వెంకటేష్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశ ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంతంగి రాజ భూపాల్ గౌడ్ మాట్లాడుతూ జిల్లా కార్యవర్గ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు, రాష్ట్ర సంఘటనా మంత్రి చంద్రశేఖర్ తివారీ హాజరుకానున్నట్లు తెలిపారు. సన్నాహక సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు నారాయణ యాదవ్, దేవేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షురాలు శోభారెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు మమతారెడ్డి, జిల్లా కోశాధికారి అమలాపురం నరసింహ, కార్యదర్శి ఇసునాతి శ్రీనివాస్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ నవీన్ మాల, గిరిజన మోర్చా అధ్యక్షులు మోహన్ సింగ్ నాయక్, మండల అధ్యక్షులు చిత్తం లక్ష్మీకాంత్ రెడ్డి, పిట్టల సురేష్, అరవింద్, రణధీర్ గౌడ్, ఎదర రాజు, సీనియర్ నాయకులు మల్చల్ మురళి, వంశీకృష్ణ, కౌన్సిలర్ పేట అశోక్, మఠం ఋషికేష్, మోటే శ్రీనివాస్, సుధాకర్, టౌన్ కన్వీనర్ శ్రీనివాస చారి, నాగరాజ్ చారి, శివాజీ, కంచుకోట మహేష్, మోటే శీను, ఉపసర్పంచ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ ప్రధాన జిల్లా కార్యదర్శిగా ఇబ్రహీం..మైనార్టీల్లో హర్షం



రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ప్రధాన కార్యదర్శిగా తన నియామకం ద్వారా పార్టీ మైనార్టీ వర్గానికి సముచిత గుర్తింపు కల్పించిందని ఎండి ఇబ్రహీం అన్నారు. మైనార్టీలకు బాధ్యతలు అప్పగించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందనే విషయం మరోసారి స్పష్టమైందన్నారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేస్తానన్నారు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ పార్టీ ఆశయాల సాధనకు కృషి చేయడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తనకు బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి, సహకరించిన నాయకులకు, ధన్యవాదములు, శుభాకాంక్షలు తెలిపిన కార్యకర్తలకు ఎండి ఇబ్రహీం కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా ఇషా మెడికల్ హాల్ అండ్ పేట్ షాప్ ప్రారంభోత్సవం

**- హాజరైన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జంగిలి కుమార్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 20 (జర్నలిస్ట్ డైరీ)** కొత్తూరు మండలం పెంజర్ల రోడ్డులో నర్సప్పగూడ గ్రామానికి చెందిన జంగిలి శ్రీను (తండ్రి: పెంటయ్య) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇషా మెడికల్ హాల్ అండ్ పేట్ షాప్ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ..., తమ షాపులో పశువులు, కోళ్లు, కుక్కలు తదితర పెంపుడు జంతువులకు అవసరమైన అన్ని రకాల మందులు, వెటర్నరీ ఉత్పత్తులు సరసమైన ధరలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులు, పాడి పరిశ్రమ నిర్వాహకులు, పశుపోషకులకు అవసరమైన నాణ్యమైన ఔషధాలు ఒకే చోట లభిస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జంగిలి కుమార్, శేఖర్, శ్రీశైలం, సురేందర్, మల్లేష్ అల్లి వినయ్ శివ స్థానిక ప్రజలు, గ్రామ రైతులు, స్నేహితులు, బంధువులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్గం-నరకం మనసు ఎంచుకునే జీవితం



మరణం తర్వాత స్వర్గం ఉందా? నరకం ఉందా? అనే ప్రశ్న వేల సంవత్సరాలుగా మానవుణ్ని వెంటాడుతోంది. మతాలు, తత్వాలు, సంప్రదాయాలు ఈ ప్రశ్నకు తమదైన సమాధానాలు చెప్పాయి. కానీ ఒక ప్రశ్న మాత్రం మనం చాలా అరుదుగానే వేసుకుంటాం. మనం వెతుకుతున్న స్వర్గం నిజంగా మరణం తర్వాత దొరికేదేనా? లేక మనం బ్రతుకుతున్న జీవితంలోనే దానిని గుర్తించలేకపోతున్నామా? అదే విధంగా నరకం కూడా ఎక్కడో భూగర్భంలో ఉన్న శిక్షా స్థలమా, లేక మన ఆలోచనలతో, మన అసంతృప్తితో మనమే ప్రతిరోజూ నిర్మించుకునే మానసిక స్థితినా?

మనిషి చరిత్రను ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే ఒక గొప్ప నిజం అర్థమవుతుంది. నేటి సాధారణ మనిషి అనుభవిస్తున్న సౌకర్యాల్లో చాలా వరకు గతంలో మహారాజులకు కూడా లేవు. ఒక స్విచ్ నొక్కగానే వెలుగు రావడం, మరో బటన్ నొక్కగానే చల్లని గాలి వీచడం, కుళాయి తిప్పగానే తాగునీరు రావడం, కొన్ని నిమిషాల్లో ఆహారం సిద్ధం కావడం, ప్రపంచం మరో మూలలో ఉన్న మనిషితో క్షణాల్లో మాట్లాడగలగడం, వేల పుస్తకాల జ్ఞానం ఒక చిన్న మొబైల్‌లో దొరకడం---ఇవన్నీ కొన్ని తరాల క్రితం అద్భుతాలే. నేడు ఇవి మనకు అంత సాధారణంగా అనిపిస్తున్నాయి కాబట్టి వాటి విలువనే మర్చిపోయాం.

సమస్య సౌకర్యాల కొరతలో లేదు. వాటికి అలవాటు పడిపోయిన మనసులో ఉంది. మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు దీనిని "హెడానిక్ అడాప్టేషన్" అని పిలుస్తారు. అంటే ఏ కొత్త సుఖమైనా కొంతకాలానికే సాధారణమైపోతుంది. కొత్త ఇల్లు కొన్నప్పుడు కలిగిన ఆనందం కొన్ని నెలలకే తగ్గిపోతుంది. కొత్త కారు కొన్న సంతోషం కొద్ది రోజుల్లో మామూలైపోతుంది. కొత్త ఫోన్ తెచ్చుకున్న ఉత్సాహం మరో కొత్త మోడల్ మార్కెట్‌లోకి వచ్చిన వెంటనే ఆవిరైపోతుంది. మనిషి తనకు దొరికిన ఆనందాన్ని ఆస్వాదించకుండా, ఇంకా దొరకనిదానికే మనసును బంధిస్తాడు. అక్కడే అసంతృప్తి పుడుతుంది. అదే నరకానికి తొలి మెట్టు.

సంతోషం అనేది వస్తువుల సంఖ్యతో పెరగదు. పోలికల సంఖ్యతో తగ్గిపోతుంది. మన ఇల్లు మనకు చాలనిపిస్తుంది. కానీ పక్కింటి ఇల్లు పెద్దదిగా కనిపించిన క్షణం మన ఆనందం కరిగిపోతుంది. మన ఆదాయం సరిపోతుంది. కానీ ఇంకొకరి సంపాదన ఎక్కువగా కనిపించినప్పుడు మనకు లోటు మొదలవుతుంది. సోషల్ మీడియా కాలంలో ఈ పోలికల వ్యాధి మరింత పెరిగింది. ప్రతి ఒక్కరూ తమ జీవితంలోని అందమైన క్షణాలనే ప్రపంచానికి చూపిస్తున్నారు. వాటిని చూసే మనిషి తన సాధారణ జీవితాన్ని వైఫల్యంగా భావించడం మొదలుపెడుతున్నాడు. వాస్తవానికి అతను పోల్చుకుంటున్నది నిజజీవితాన్ని కాదు; ఎంపిక చేసి చూపించిన చిత్రాలనే. అదే సమయంలో ఈ భూమిపైన మరో ప్రపంచం కూడా ఉంది. ఈ రోజుకీ కోట్లాది మంది పరిశుభ్రమైన తాగునీటి కోసం కిలోమీటర్లు నడుస్తున్నారు. చాలామందికి పక్కా ఇల్లు లేదు. లక్షలాది పిల్లలు చదువు కంటే ఉపాధిని ఎంచుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. ఆకలి, అనారోగ్యం, నిరాశ్రయత్వం ఇంకా ప్రపంచంలో కోట్లాది కుటుంబాల వాస్తవం. మనం సాధారణంగా తీసుకునే ప్రతి చిన్న సౌకర్యం మరొకరి జీవితకాల కల కావచ్చు. ఈ వాస్తవం గుర్తొచ్చినప్పుడు కృతజ్ఞత అనే భావన సహజంగానే పుడుతుంది.

అయితే కృతజ్ఞత అంటే సమస్యలను చూడకపోవడం కాదు. జీవితంలో అన్యాయం లేదని చెప్పడం కాదు. సమాజంలో పేదరికం, అసమానతలు, వివక్ష, బాధలు లేవని కళ్లుమూసుకోవడం కూడా కాదు. నిజమైన కృతజ్ఞత అంటే మనకు ఉన్న వరాలను గుర్తించడంతో పాటు, వాటి విలువ తెలిసిన మనిషిగా ఇతరుల జీవితాలను కూడా మెరుగుపరచడానికి ప్రయత్నించడం. తనకు లభించిన అవకాశాలను సమాజంతో పంచుకోవడం. ఎందుకంటే మన వ్యక్తిగత స్వర్గం, చుట్టూ ఉన్నవారి నరకం మీద నిర్మించబడితే అది సంపూర్ణ ఆనందం కాదు. తత్వశాస్త్రంలో ఒక అందమైన భావన ఉంది. మనిషిని బాధపెట్టేది సంఘటన కాదు; ఆ సంఘటనను అతను అర్థం చేసుకునే విధానం. ఒకే వర్షాన్ని రైతు ఆశీర్వాదంగా చూస్తాడు. పెళ్లి నిర్వాహకుడు ఇబ్బందిగా చూస్తాడు. సంఘటన ఒకటే. అనుభవం మాత్రం భిన్నం. అంటే మన జీవిత నాణ్యతలో పెద్ద భాగాన్ని పరిస్థితులు కాకుండా మన దృక్పథమే నిర్ణయిస్తుంది. అందుకే కొందరు కష్టాల్లో కూడా ప్రశాంతంగా జీవిస్తారు. మరికొందరు అన్ని సౌకర్యాల మధ్య కూడా అసంతృప్తితో కాలం గడుపుతారు.

ప్రతి రోజు ముగిసే ముందు మనం కోల్పోయిన వాటి జాబితా కాకుండా, లభించిన వరాల జాబితా రాస్తే మన ఆలోచనలో గొప్ప మార్పు వస్తుంది. ఈరోజు నేను ఆరోగ్యంగా ఉన్నానా? నాకు తినడానికి ఆహారం ఉందా? తాగడానికి నీరు ఉందా? ప్రేమించే కుటుంబం ఉందా? నేర్చుకునే అవకాశం ఉందా? ఇంకో రోజు జీవించే అవకాశం లభించిందా? ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం చెప్పగలిగితే మనం ఇప్పటికే ఎంతో సంపన్నులమని అర్థమవుతుంది. కృతజ్ఞత అనేది సమస్యలను తొలగించదు; కానీ సమస్యల బరువును తగ్గించే అంతర్గత బలాన్ని ఇస్తుంది.

మానవ జీవితం సంపూర్ణం కాదు. సుఖం, దుఃఖం, విజయం, వైఫల్యం, ఆశ, నిరాశ ఇవన్నీ కలిసే జీవితం. కానీ వాటిలో దేనికి ఎక్కువ స్థానం ఇవ్వాలో నిర్ణయించేది మనమే. ఫిర్యాదులను లెక్కించే మనసు ఎప్పటికీ నరకంలోనే ఉంటుంది. అవకాశాలను, అనుబంధాలను, చిన్న చిన్న ఆనందాలను గుర్తించే మనసు ఎక్కడ ఉన్నా స్వర్గాన్నే సృష్టిస్తుంది. స్వర్గం అనేది భౌగోళిక స్థలం కాదు; మనసు పొందే ప్రశాంతత. నరకం అనేది శిక్షల ప్రపంచం కాదు; అంతులేని అసంతృప్తి. చివరికి మనిషి జీవితంలో అత్యంత విలువైన ప్రశ్న ఇదొక్కటే... "నాకు ఇంకా ఏమి కావాలి?" కంటే, "ఇప్పటికే నాకు ఎంత లభించింది?" అని ఎన్ని సార్లు ఆలోచించాను? అనే ప్రశ్న. ఆ క్షణం నుంచే జీవితం మారుతుంది. ఎందుకంటే తృప్తి అనేది బయట దొరికే బహుమతి కాదు; లోపల పెంచుకునే సంస్కారం. కృతజ్ఞత అనేది సంపద తర్వాత వచ్చే గుణం కాదు. అదే నిజమైన సంపద. ఆ సంపదను సంపాదించిన మనిషికి ప్రతి ఉదయం ఒక కొత్త వరం, ప్రతి శ్వాస ఒక పండుగ, ప్రతి రోజు ఒక స్వర్గానుభూతి అవుతుంది.

**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసిన గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 20 (జర్నలిస్ట్ డైరీ) :** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్ చౌరస్తా నుండి తులసి వనం ఔట్ లెట్ వరకు రూ.48 లక్షల 65 వేల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం పనులకు తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాస రావు మరియు జలమండలి అధికారులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.... భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మెరకు మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవ తో ఈ రోజు మహంకాళి నగర్ కాలనీలో రూ.48 లక్షల 65 వేల రూపాయల తో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణము పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని. తెలియచేసారు, అత్యవసరం ఉన్న చోట , నిత్యం పొంగుతున్న ప్రాంతలలోప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని తెలియచేశారు. ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని, కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ,కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో




ముందుకు తీసుకువెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని తెలియచేసారు. కాలనీలలో గల ఎన్నో ఏండ్ల సమస్య నేటి తో తిరునని, నిత్యం పొంగుతుండటం వలన కాలనీ వాసులు , ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు అని వాటిని దృష్టిలో పెట్టుకొని ఈ రోజు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయడం జరిగినది అని, అదేవిధంగా ప్రతి కాలనీ లో స్వచ్ఛమైన మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం చేపట్టడం ద్వారా కాలనీ వాసులకు ప్రజలకు, స్వచ్ఛైమన మంచి నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, విజిడి పైప్ లైన్ వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని , ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించడం జరిగినది , నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని , అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని , మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని , నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, అదేవిధంగా సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన , అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు జీఎం హరిశంకర్, డీజీఎం శ్రీనివాస రాజు, మేనేజర్ అనిల్ మరియు నాయకులు, కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు

# అంతర్జాతీయ ప్లాస్టిక్ నివారణ దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ

**హైదరాబాద్, జూలై 20 (జర్నలిస్ట్ డైరీ) :** అంతర్జాతీయ ప్లాస్టిక్ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్(టీసీసీ) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హరిబోలిలోని రిఫాయం హైస్కూల్‌లో అవగాహన సదస్సు, సుధా టాకీస్ నుంచి శాలిబండ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ కె.పురుషోత్తం రెడ్డి, ప్రధాన వక్త డాక్టర్ సి.ఉమా మహేశ్వర్ రెడ్డి, మొఘల్‌పురా ఎస్ఐ పి.సాయికుమార్ ప్లాస్టిక్ వల్ల ఆరోగ్య, పర్యావరణానికి కలిగే నష్టాలపై అవగాహన




కల్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ అధ్యక్షత వహించగా, వ్యాసరచన విజేతలను సన్మానించారు. పాతబస్తీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఉత్తం కొటారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిద్ధేష్ ముదిరాజ్, మహమ్మద్ అక్తర్ షరీఫ్, ఎస్.పుల్లారెడ్డి, కె.నీరజ, ఎం.విద్యావతి, మొహమ్మద్ షాహిద్ అలీ, కె.రవీందర్, జి.వేణుగోపాల్, కె.శ్యామ్‌రావు ముదిరాజ్, బిచ్చుకారి సూర్య, ఎం.చంద్రకళ, ఆర్.వసంత, ఎస్.వెంకట్‌రెడ్డి, పి.వి.ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# హైదరాబాద్‌లో 11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్ ఛాంపియన్‌షిప్-2026







**36 పోలీస్, సీఏపీఎఫ్ సంస్థలకు చెందిన క్రీడాకారులు ఐదు క్రీడాంశాల్లో పోటీ**

**జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జూలై 23 నుంచి 30 వరకు నిర్వహణ**

**తెలంగాణ రాష్ట్ర జంతువు ఆధారంగా రూపొందించిన 'వీరా' మస్కట్ ఆవిష్కరణ**

హైదరాబాద్, జూలై 20 (జర్నలిస్ట్ డైరీ)
అఖిల భారత పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఏఐపీఎస్‌సీబీ) ఆధ్వర్యంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) నిర్వహిస్తున్న 11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్ ఛాంపియన్‌షిప్-2026 హైదరాబాద్‌లోని గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జూలై 23 నుంచి 30 వరకు వైభవంగా జరగనుంది. ఈ జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా 36 రాష్ట్ర పోలీస్, కేంద్ర సాయుధ భద్రతా దళాల (సీఏపీఎఫ్) సంస్థలకు చెందిన 1,600 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని జూడో, వుషు, టేక్వాండో, కరాటే, పెంచాక్ సిలాట్ విభాగాల్లో ప్రతిభను చాటుకోనున్నారు. పోటీల నిర్వహణ, పర్యవేక్షణ కోసం వివిధ జాతీయ క్రీడా సమాఖ్యలకు చెందిన సుమారు 150 మంది సాంకేతిక అధికారులు సేవలు అందించనున్నారు.

ఈ మేరకు హైదరాబాద్‌లోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (ఎన్ఐఎస్ఏ)లో సోమవారం నిర్వహించిన కర్టెన్ రైజర్-కమ్-ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పోటీల వివరాలను వెల్లడించారు. ఎన్ఐఎస్ఏ డైరెక్టర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీమతి హర్‌ప్రీత్ కౌర్ సోహి మాట్లాడుతూ, ఈ ఛాంపియన్‌షిప్ పోలీస్, సీఏపీఎఫ్ సిబ్బందిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు యువ అథ్లెట్లకు తమ ప్రతిభను జాతీయ వేదికపై ప్రదర్శించుకునే అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఒలింపియన్ పారుపల్లి కశ్యప్, ప్రముఖ రోయింగ్ కోచ్ ఇస్మాయిల్ బైగ్ మాట్లాడుతూ, యూనిఫాం సేవల్లో క్రమశిక్షణ, సహనశీలత, బృంద స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ తరహా పోటీలు అథ్లెట్లను అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు ప్రోత్సహిస్తాయని అభిప్రాయపడ్డారు. ఆసియా క్రీడలు-2026కు ముందు నిర్వహిస్తున్న ఈ ఛాంపియన్‌షిప్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. పోటీల్లో ఉన్న జూడో, వుషు, టేక్వాండో, కరాటే క్రీడాంశాలు ఆసియా క్రీడల్లో కూడా భాగం కావడంతో, పోలీస్, సీఏపీఎఫ్ అథ్లెట్లకు ఇది అంతర్జాతీయ పోటీలకు ఉపయోగపడే విలువైన అనుభవాన్ని అందించనుంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జంతువైన మచ్చల జింక (చిటాల్) ఆధారంగా రూపొందించిన ఛాంపియన్‌షిప్ అధికారిక మస్కట్ 'వీరా'ను ఆవిష్కరించారు. 'వీరా' సజీవత, చురుకుదనం, సహనశీలత, మార్షల్ ఆర్ట్స్ స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. క్రీడాకారులు, అధికారుల కోసం సమగ్ర వైద్య, వసతి సదుపాయాలు కల్పించగా, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ, తెలంగాణ పోలీస్ అకాడమీతో పాటు ఇతర భాగస్వామ్య సంస్థలు రవాణా, నిర్వహణ సహకారం అందిస్తున్నాయి. నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా) ఆధ్వర్యంలో యాంటీ డోపింగ్ పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# నారాయణ స్కూల్ ఇన్వెస్టిచర్ సెరిమనీలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

హయత్‌నగర్, జూలై 20 (జర్నలిస్ట్ డైరీ)
ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సూర్యనగర్ కాలనీలో గల నారాయణ స్కూల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించిన ఇన్వెస్టిచర్ సెరిమనీ కార్యక్రమంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు, సాష్‌లను ప్రదానం చేసి వారి బాధ్యతలను అధికారికంగా స్వీకరింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశలో అలవర్చుకునే క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సమయపాలన, సేవాభావం భవిష్యత్ జీవితానికి బలమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యలో ప్రతిభ కనబరచడంతో పాటు నైతిక విలువలు, దేశభక్తి, సామాజిక బాధ్యతలను పెంపొందించుకుని సమాజానికి ఆదర్శప్రాయమైన




పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాలలు విద్యను అందించడమే కాకుండా విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ సామర్థ్యాలను పెంపొందించే వేదికలుగా నిలవాలని అన్నారు. ఇన్వెస్టిచర్ సెరిమనీ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, బాధ్యతాయుతమైన నాయకత్వాన్ని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. అనంతరం పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు కళ్లెం నవజీవన్ రెడ్డికి ఘన స్వాగతం పలికి, కార్యక్రమానికి హాజరైనందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల జనరల్ మేనేజర్ గోపాల్ రెడ్డి, ఏజీఎం రవీంద్ర బాబు, ప్రిన్సిపాల్ లావణ్య, అడ్మిన్ ఆఫీసర్లు అనంత చంద్రశేఖర్ గౌడ్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, నాయకులు ఎర్ర శ్రీకాంత్‌తో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణకు సామూహిక చర్య

**బోయిన్ పల్లిలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ..**

**1--19 ఏళ్ల వారికి పంపిణీ ప్రారంభం**



మిడ్జిల్, జూలై 20, (జర్నలిస్ట్ డైరీ)
జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా సోమవారం మిడ్జిల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ నెల 20న నిర్వహించనున్న మాప్-అప్ డేలో మిగిలిన వారికి కూడా మాత్రలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. బోయిన్ పల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మీర్జా మాట్లాడుతూ, నులిపురుగుల నివారణతో పిల్లల ఆరోగ్యం మెరుగుపడి, పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలను నివారించవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అయూబ్ ఖాన్, పల్లె దవాఖాన వైద్యురాలు డాక్టర్ అనుష, హెల్త్ సూపర్వైజర్లు దేవయ్య, జంగయ్య, ఏఎన్ఎం తిరుపతమ్మ, ఆశా కార్యకర్తలు నాగమణి, రాజేశ్వరి, తిరుపతమ్మ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్ విజేతలను అభినందించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





పటాన్ చెరువు, జూలై 20 (జర్నలిస్ట్ డైరీ)
కరాటే పోటీలలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన చిన్నారులను పటాన్చెరు శాసన సభ్యులు అభినందించారు. ఇటీవల గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీలలో బీరంగూడకు చెందిన క్రేజీ క్రూ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు. అద్భుతమైన ప్రదర్శనలతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో చిన్నారులను జిఎంఆర్ అభినందించారు. విద్యార్థి స్థాయి నుండి క్రీడల పై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, గురువులు ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి రెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లేష్, శివా రెడ్డి, వెంకటేష్, మేరాజ్ ఖాన్, రామచందర్, రామకృష్ణ, అకాడమీ నిర్వాహకులు సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు కురవాలని ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆమనగల్లు, జులై20 (జర్నలిస్ట్ డైరీ)
వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు, ప్రజల సంక్షేమం కోసం వరుణుడి కటాక్షం కలగాలని ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ పత్యా నాయక్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలతో కలిసి ఆమనగల్లు అంగడి బజార్ హనుమాన్ దేవాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దల అభిప్రాయాలను సేకరించి, అందరి ఆమోదంతో ఈ నెల 23వ తేదీ (గురువారం) ఆమనగల్లు పట్టణంలో ఆనవాయితీగా నిర్వహించే"వరద పాశం"కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. పట్టణంలోని దేవాలయాలను సుందరీకరించి, వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రత్యేక పూజలు, సంప్రదాయ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చైర్మన్ తెలిపారు. రైతుల పంటలు సస్యశ్యామలం కావాలని ప్రజలందరికీ శుభ ఫలితాలు కలగాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు ముక్తాల వెంకటయ్య, నాగిళ్ల జగన్,మల్యా నాయక్, కో ఆప్షన్ సభ్యుడు చుక్క అల్లాజీ గౌడ్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, వస్పుల జంగయ్య, మానయ్య, మల్లయ్య,యాదయ్య, మైసయ్య, చంద్రయ్య, జంతుక శంకర్,రేవల్లి రాజు,సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# 'సర్'ప్రక్రియను పరిశీలించిన బిజెపి నేత టి.ఆచారి



ఆమనగల్లు,జులై20 (జర్నలిస్ట్ డైరీ)
ఆమనగల్లు మండల పరిధిలోని కోనాపూర్, గౌరారం,ఆకుతోటపల్లి, శెట్టిపల్లి,మాలపల్లి ,గ్రామాలలో సోమవారం విస్తృతంగా పర్యటించారు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన (ఎస్ఐఆర్) కార్యక్రమ నిర్వహణను జాతీయ మాజీ ఓబీసీ మెంబర్ తల్లోజు ఆచారి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, అవసరమైన పత్రాలు మరియు వివరాలను సమర్పిస్తూ బిఎల్ఓ లకు పూర్తి సహకారం అందించాలని అన్నారు.సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమంలో భాగస్వాములై కృషి చేస్తున్న అంగన్వాడీ టీచర్లు,ప్రభుత్వ ఉపాధ్యాయులు, పంచాయితీ కార్యదర్శులు,బిఎల్ ఎలను ఈ సందర్భంగా ఆచారి అభినందించారు. ఈ కార్యక్రమంలో గోరటి నరసింహ, కేకే, సర్పంచ్ సైదులు,మల్లేష్,జగన్ ,రమేష్,శివ,ప్రసాద్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూల్ జిల్లా నూతన బిజెవైఎం అధ్యక్షుడిని సన్మానించిన మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు టి. ఆచారి



ఆమనగల్లు,జులై20 (జర్నలిస్ట్ డైరీ)
నూతనంగా బీజేవైఎం నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన నరేష్ చారి ని బిజెపి పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి వారిని సన్మానించారు. బీజేవైఎం నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన నరేష్ చారిని, తల్లోజు ఆచారి ఘనంగా సన్మానించి,వారిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేసి విజయాలు సాధించాలని ఆచారి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు,జిల్లా నాయకులు,రాష్ట్ర నాయకులు,ఏబీవీపీ నాయకులు,పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.'

# చీకట్లో చలామణి అవుతున్న చెల్లని నోట్లు




ఆమనగల్లు,జులై20 (జర్నలిస్ట్ డైరీ)
రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో సాయంత్రం వేళల్లో చెల్లని నోట్ల చలామణి ఎక్కువైందని చిరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆమనగల్లులో సాయంత్రం వేళల్లో పాన్ డబ్బాల వద్ద, కూరగాయల షాప్ ల వద్ద,మిర్చి,మిక్సర్ తోపుడు బండ్ల వద్ద ఈ చెల్లని నోట్లతో చిరు వ్యాపారులను మోసం చేస్తున్నారని చిరు వ్యాపారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వేళల్లోనే జరుగుతుందని వినికిడి. చిరు వ్యాపారులు సాయంత్రం వేళల్లో రూ.100,రూ.200, నోట్లను తీసుకోవాలంటే హడలిపోతున్నారు. ఈ నకిలీ నోట్ల చలామణి చేసే వారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందిని,సంబంధిత ఆయా శాఖల అధికారులను పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# బిజినెస్

## అమెరికా, ఇరాన్ ఉద్రిక్తతలు..

-క్రూడ్ ఆయిల్ ధరలకు రెక్కలు




అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. సోమవారం బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 90 డాలర్ల మార్క్‌ను దాటింది. హర్మూజ్ జలసంధి మీదుగా చమురు సరఫరాలకు అంతరాయం కలుగవచ్చనే ఆందోళనతో మార్కెట్లలో కొనుగోళ్లు పెరిగాయి. దాంతో గత రెండు రోజులుగా చమురు ధరలు వరుసగా ఎగబాకుతున్నాయి.సోమవారం బ్రెంట్ క్రూడ్ ధర దాదాపు మూడు శాతం పెరిగి బ్యారెల్‌కు 90 డాలర్లు దాటింది. అంతకుముందు ట్రేడింగ్ సెషన్‌లో కూడా ఇదే స్థాయిలో పెరుగుదల నమోదైంది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) క్రూడ్ కూడా 3.5 శాతానికి పైగా పెరిగి బ్యారెల్‌కు 85.39 డాలర్ల వద్ద ట్రేడైంది. దేశీయంగా మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్) లో ఆగస్టు క్రూడ్ ఫ్యూచర్స్ ధరలు కూడా జోరందుకున్నాయి. ఉదయం ట్రేడింగ్‌లో బ్యారెల్‌కు రూ.210 పెరిగి రూ.8,120 ఇంట్రాడే గరిష్ఠస్థాయికి చేరాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావమే దేశీయ ధరలపైనా కనిపించింది. వారాంతంలో అమెరికా, ఇరాన్ మధ్య సైనిక చర్యలు మరింత తీవ్రం కావడం మార్కెట్లను కలవరపరిచింది. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో లేదని టెహ్రాన్ ప్రకటించడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేసింది. వరుసగా తొమ్మిదో రోజు ఇరాన్‌లోని లక్ష్యాలపై దాడులు నిర్వహించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. వాణిజ్య నౌకలు, పౌర నౌకలపై దాడులకు తెగబడుతున్న ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని బలహీనపర్చడమే తమ లక్ష్యమని తెలిపింది. మరోవైపు హర్మూజ్ జలసంధిలో నాలుగు నౌకలను అడ్డుకున్నట్లు ఇరాన్ నౌకాదళం వెల్లడించింది. వాటిలో రెండు ప్రమాదాలకు గురికాగా, మరో రెండు వెనక్కి వెళ్లిపోయినట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో ముడిచమురు ధరలు సమీప కాలంలో బలంగానే కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

## స్టాక్ మార్కెట్ భారీ పతనం..
## 442 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

భారత స్టాక్ మార్కెట్ సోమవారం భారీగా నష్టపోయింది. బ్యాంకింగ్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి, అంతర్జాతీయ పరిణామాల కారణంగా సెన్సెక్స్ 442 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ 95 పాయింట్లు నష్టపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఉదయం 78,151.45 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. తర్వాత నష్టాల బాటపట్టింది. మధ్యలో 78,151.45 పాయింట్లకు చేరుకుని, అనంతరం మళ్లీ నష్టాల్లోనే నడిచింది.ఒక దశలో 783.16 పాయింట్లు నష్టపోయి 77,368.29 పాయింట్ల కనిష్టాన్ని తాకింది. చివరకు 442.93 పాయింట్ల నష్టంతో 77,708.52 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 95.80 పాయింట్లు నష్టపోయి చివరకు 24,238.50 వద్ద ముగిసింది. అయితే, బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ మాత్రం 72.20 పాయింట్లు లాభపడింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్



ఇండెక్స్ 48.75 పాయింట్లు నష్టపోయింది. బ్యాంకింగ్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడితోపాటు అమెరికా, ఇరాన్ యుద్ధం, చమురు ధరల పెరుగుదల వంటివి మార్కెట్ పతనానికి కారణాలు. సెన్సెక్స్ 30 సూచీలో కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, మారుతి సుజుకి షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఇందులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 5 శాతం, యాక్సిస్ బ్యాంక్ షేర్లు 6 శాతం నష్టపోయాయి. అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్టీపీసీ, ట్రెంట్, ఎస్బీఐ, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా రూపాయి స్వల్పంగా బలహీనపడింది. డాలర్‌తో రూపాయి మారక విలువ 96.44గా ఉంది. బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 91 డాలర్లకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ఔన్స్ ధర 4021 వద్ద కొనసాగుతోంది. జపాన్ నిక్కీ, దక్షిణ కొరియా కోస్పి సహా అంతర్జాతీయ మార్కెట్లు సోమవారం నష్టాల్లోనే ముగిశాయి.

## హ్యుందాయ్ చార్జింగ్ టెన్షన్స్‌కు చెక్..
## అందుబాటులోకి మరిన్ని చార్జింగ్ పాయింట్లు

ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ కీలక ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహన వినియోగదారుల కోసం తమ 'మైహ్యుందాయ్ యాప్ ద్వారా 30,000 కు పైగా చార్జింగ్ పాయింట్ల ను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించింది. దాంతో ఒకే ప్లాట్‌ఫామ్‌పై లభించే భారతదేశంలోని అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ఈవీ చార్జింగ్ నెట్‌వర్క్‌లలో ఒకటిగా ఇది నిలిచింది.ప్రముఖ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్లు, సర్వీస్ ప్రొవైడర్లతో భాగస్వామ్యం కుదుర్చుకుని ఈ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేసినట్లు కంపెనీ తెలిపింది. విశేషమేమిటంటే ఈ నెట్‌వర్క్ కేవలం హ్యుందాయ్ కార్లకే పరిమితం కాకుండా అన్ని బ్రాండ్ల ఎలక్ట్రిక్ వాహనాలకు అందుబాటులో ఉంటుంది. ఈ యాప్ ద్వారా సమీపంలోని చార్జింగ్ స్టేషన్లను గుర్తించడం, వాటికి నావిగేట్ చేయడం, ముందుగానే స్లాట్ బుక్ చేసుకోవడం, డిజిటల్ పద్ధతిలో చెల్లింపులు జరపడం వంటివి సులభంగా చేసుకోవచ్చు. ఈ ఇంటిగ్రేటెడ్




నెట్‌వర్క్ ద్వారా దేశవ్యాప్తంగా సగటున 25 కిలోమీటర్ల పరిధిలో ఒక చార్జింగ్ స్టేషన్ అందుబాటులో ఉంటుందని హ్యుందాయ్ పేర్కొంది. ఢిల్లీ-జైపూర్, ముంబై-పుణె-బెంగళూరు, హైదరాబాద్-కర్నూలు-బెంగళూరు వంటి ప్రధాన హైవే కారిడార్లలో కూడా ఈ సౌకర్యం విస్తరించింది. ఈ సందర్భంగా హెచ్ఎంఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో తరుణ్ గార్గ్ మాట్లాడుతూ.. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచడంలో చార్జింగ్ మౌలిక సదుపాయాలు చాలా కీలకమని అన్నారు. "మైహ్యుందాయ్ యాప్‌లో 30,000కు పైగా చార్జింగ్ పాయింట్లను ఏకీకృతం చేయడం ద్వారా, ఈవీ యూజర్లకు దేశంలోని అతిపెద్ద నెట్‌వర్క్‌లలో ఒకదానిని అందిస్తున్నాం" అని చెప్పారు. అంతేగాక కంపెనీ తన సొంత డీసీ ఫాస్ట్ పబ్లిక్ చార్జింగ్ నెట్‌వర్క్‌ను కూడా భారీగా విస్తరించాలని యోచిస్తోంది. ప్రస్తుతం ఉన్న 183 స్టేషన్లను 2030 నాటికి 600 స్టేషన్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు తమ చార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా మూడు లక్షలకుపైగా చార్జింగ్ సెషన్‌లు జరిగాయని, దీనివల్ల సుమారు 3.5 మిలియన్ కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను నివారించగలిగామని కంపెనీ తెలిపింది. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే మాస్ మార్కెట్ కోసం ఒక కొత్త ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని విడుదల చేయడానికి కూడా హ్యుందాయ్ సన్నాహాలు చేస్తోంది.

# స్పోర్ట్స్

## మా ఓటమికి గాయాలూ ఓ కారణం..
## ఫిట్‌నెస్ మెరుగుపడాల్సిందే..!

ఇంగ్లండ్ గడ్డపై టీ20 సిరీస్ చేజారినా.. వన్డే సిరీస్ అయినా గెలుస్తామనుకుంటే అది కూడా అప్పగించేసింది భారత జట్టు. పసలేని బౌలింగ్ కారణంగా లార్డ్స్ వన్డే లో భారీ స్కోర్ సమర్పించుకున్న టీమిండియా.. రోహిత్ శర్మ శతకం కొట్టినా ఓటమిని తప్పించుకోలేకపోయింది. 1-2తో సిరీస్ కోల్పోవడంపై మీడియాతో మాట్లాడిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తమ పరాజయానికి గాయాలూ ఓ కారణమని చెప్పాడు. ఆటగాళ్లు ఫిట్‌నెస్‌ను లైట్‌గా తీసుకోవడంపై గిల్ ఆగ్రహం వ్యక్తం చేశాడు.వన్డే ప్రపంచకప్ సన్నాహకాల్లో ఉన్న భారత జట్టుకు ఇంగ్లండ్ పెద్ద షాకిచ్చింది. మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో గెలుపొంది టీమిండియా మేనేజ్‌మెంట్‌ను ఆలోచనల్లో పడేసింది. సిరీస్ మధ్యలో ఆటగాళ్లు గాయాల బారిన పడడం, పేలవ ప్రదర్శనకు మూల్యం చెల్లించింది శుభ్‌మన్ గిల్ సేన. మ్యాచ్ అనంతరం 'సిరీస్ ఓటమికి గాయాలూ ఓ కారణమా?' అని విలేకరులు ప్రశ్నించగా 'అవును' అని బదులిచ్చాడు గిల్.తొలుత ప్రకటించిన స్క్వాడ్‌లోని ఐదుగురు లార్డ్స్ వన్డేలో ఆడలేదు. ఒకరు





గాయపడితే మరొకరిని ఆడించడం, కాంబినేషన్లు మార్చడం తప్పలేదు. ఇద్దరు గాయపడితే.. మళ్లీ కొత్త కాంబినేషన్. ప్రతి మ్యాచ్ అనంతరం ఒకరు గాయపడితే.. మేము మ్యాచ్‌లో ట్రిక్ మిస్ అవుతున్నాం. వరల్డ్‌కప్‌ను తీసుకుంటే వరసగా 11 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. కానీ, కొందరు ఆటగాళ్లు సిరీస్‌లో 2-3 మ్యాచులు సైతం ఆడలేకుంటే ఎలా? మా ఆటగాళ్లు వరసగా మ్యాచ్‌లు ఆడలేకపోతుండంలో ఏదో పొరపాటు జరుగుతోంది.మ్యాచ్ రోజు ఉదయమే ఒకరు గాయంతో దూరమైతే.. మరొకరిని తీసుకోక తప్పదు. ఒకరు 80 శాతం ఫిట్‌గా ఉన్నా.. ఐదుగురు బౌలర్లతో ఆడాల్సి వచ్చినా గెలవడం కష్టం. ఒక గ్రూప్‌గా మేము ఫిట్‌నెస్‌లో తేలిపోతున్నాం. ఇవన్నీ మెరుగుపడాలి అని గిల్ పేర్కొన్నాడు. అలానే రోహిత్‌కు ఇదే ఆఖరి మ్యాచా? అతడి వీడ్కోలు ఎప్పుడు? అని ప్రశ్నించగా.. అతడు మాకేమి చెప్పలేదు అని గిల్ బదులిచ్చాడు.

**27 పరుగుల తేడాతో**

లార్డ్స్‌లో బెన్ డకెట్(141) భారీ శతకానికి బెథెల్(91) అర్ధ శతకం, జో రూట్(74 నాటౌట్), జోస్ బట్లర్(41 నాటౌట్)ల పవర్ హిట్టింగ్‌తో 387 కొట్టిన ఇంగ్లండ్ 27 పరుగుల తేడాతో గెలుపొందింది. ఛేదనలో రోహిత్ శర్మ(138) సెంచరీ, విరాట్ కోహ్లీ(74) అర్ధ శతకం బాదినా ఓటమి తప్పలేదు.

## మా విజయం నక్షత్రాల్లో రాసి ఉంది..

-ఈ ట్రోఫీ యావత్ దేశానిది..!



ఫిఫా వరల్డ్‌కప్ 2026 ఫైనల్లో మెరుపు గోల్‌తో ఓవర్‌నైట్‌లో స్టారయ్యాడు ఫెర్రాన్ టోరెస్ . న్యూజెర్సీ మైదానంలో లియోనల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనాను సమర్థంగా నిలువరించిన స్పెయిన్‌కు 106వ నిమిషంలో స్టన్నింగ్ గోల్‌తో చిరస్మరణీయ విజయం కట్టబెట్టాడు టోరెస్. మ్యాచ్ అనంతరం పట్టలేనంత సంతోషంలో మునిగిపోయిన ఈ కుర్రాడు.. వరల్డ్ కప్ ఫైనల్లో స్పెయిన్ విజయం నక్షత్రాల్లో రాసి పెట్టి ఉందని పేర్కొన్నాడు.ఆద్యంతం ఉత్కంఠ రేపిన ఫిఫా వరల్డ్‌కప్ ఫైనల్లో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ఫెర్రాన్ టోరెస్ స్పెయిన్‌ను గెలిపించాడు. అదనపు సమయంలో మైదానంలోకి వస్తూనే సంచలన గోల్‌తో వరసగా రెండో ట్రోఫీ గెలవాలనుకున్న అర్జెంటీనా కలల్ని ఛిద్రం చేశాడీ కుర్రాడు. తన కెరీర్లోనే బిగ్గెస్ట్ గోల్ కొట్టిన టోరెస్.. మ్యాచ్ అనంతరం భావోద్వేగానికి లోనయ్యాడు.'ఈ ట్రోఫీ నా ఒక్కడిది.. ఇక్కడున్న 26 మందిది కాదు. మా దేశంలోని 47 (4.7కోట్లు) మిలియన్ల మందికి చెందుతుంది. ఈ రోజు ఫలితం ముందుగానే నక్షత్రాల్లో రాసి ఉందని నేను నమ్ముతున్నా. మేము గెలవడానికే ఫైనల్ ఉంది. మా దేశ ప్రజలకు దూరంగా ఉన్నా.. వారు మాతో పాటు ఇక్కడే ఉన్నట్టుగా చేశాం. అన్ని ఫైనల్స్ కష్టమైనవే. అలాంటిది అవతల మెస్సీ ఉన్నాడంటే ప్రత్యర్థి జట్టు నీరసిస్తుంది. అయితే.. మేము మా బ్రాండ్ ఆటను నమ్ముకున్నాం. ఈరోజు అదే ఆట ఆడి చూపించాం' అని టోరెస్ పేర్కొన్నాడు.

## ఫిఫా వరల్డ్‌కప్..
## ఎవరెవరికి అవార్డులు దక్కాయంటే





**న్యూయార్క్**

ఫిఫా వరల్డ్‌కప్ చాంపియన్‌గా స్పెయిన్ అవతరించిన విషయం తెలిసిందే. అసాధారణ రీతిలో సాగిన ఫైనల్లో 1-0 గోల్స్ తేడాతో అర్జెంటీనాను స్పెయిన్ ఓడించింది. అయితే వరల్డ్‌కప్‌లో అందజేసే అవార్డుల్లో ఫ్రాన్స్ కెప్టెన్ ఎంబాప్పేకు రెండు అవార్డులు దక్కాయి. ఫైనల్లో అత్యుత్తమ ప్రదర్శించిన స్పెయిన్ ప్లేయర్ రోడ్రికి గోల్డెన్ బాల్, అర్జెంటీనా ప్లేయర్ లియోనల్ మెస్సీకి సిల్వర్ బాల్, ఫ్రాన్స్ ప్లేయర్ కైలియన్ ఎంబాప్పేకు బ్రాంజ్ బాల్ అవార్డులు దదక్కాయి. ఇక ప్రతిష్టాత్మకమైన గోల్డెన్ బూట్ అవార్డు ఎంబాప్పేకు దక్కింది. అతనికి బ్రాంజ్ బాల్‌తో పాటు గోల్డెన్ బూట్ అవార్డు దక్కడం విశేషం. టోర్నీలో అతను 10 గోల్స్, 4 అసిస్ట్‌లతో ఆ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఇక సిల్వర్ బూట్ అవార్డు మెస్సీని వరించింది. ఇంగ్లండ్ ప్లేయర్ జూడ్ బెల్లింగ్‌హమ్‌కు బ్రాంజ్ బూట్ అవార్డు దక్కింది. ఇక టోర్నీలో ప్రత్యర్థులకు గోల్ పోస్టులో అడ్డుగోడలా నిలిచిన గోల్‌కీపర్ ఉనాయ్ సిమన్‌కు గోల్డెన్ గ్లోవ్ అవార్డు దక్కింది. ఫిఫా యంగ్ ప్లేయర్ అవార్డు స్పెయిన్ ప్లేయర్ పావు కుబారిస్‌కు దక్కింది. ఇక ఫెయిర్ ప్లే ట్రోఫీ నెదర్లాండ్స్ జట్టను వరించింది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక





# మమితా బైజు లైనప్ అదిరిందిగా

మమితాబైజు లైనప్ మామూలుగా లేదు. 'ప్రేమలు' సినిమాతో సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన ఈ అందాలభామ ఇప్పుడు అన్ని భాషల్నీ కవర్ చేస్తూ వరుసపెట్టి సినిమాలు చేస్తున్నది. అగ్రహీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి ఆమె నటించిన 'జననాయగన్' చిత్రం ఈ నెల 23న విడుదలకానున్న విషయం తెలిసిందే. ఇక సూర్యతో ఆమె నటించిన తెలుగు సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఆగస్ట్ 14న విడుదల కానున్నట్టు తెలుస్తున్నది. దర్శకుడు వెంకీ అట్లూరి ఫ్యామిలీ, లవ్ డ్రామాగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు భారీగా ఉన్నాయి. ఇక మలయాళంలో మమితా నటించిన 'బెత్లెహం కుటుంబ యూనిట్' ఆగస్ట్ 21న రిలీజ్ కానుంది. ఫహాత్ ఫాజిల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మమిత సరికొత్త పాత్రలో కనిపించనున్నది. నివిన్ పౌలీ హీరో. ఈ విధంగా విజయ్, సూర్య, నివిన్‌పౌలీ వంటి ప్రముఖ నటుల సినిమాల్లో నటిస్తూ అద్భుతమైన కెరీర్‌ని కొనసాగిస్తున్నది మమితా బైజు.



దరహో అనిపిస్తోన్న లక్ష్మీ రాయ్ అందాలు..

# ఆ హీరోను అన్ ఫాలో చేసిన అనుపమ..

**ఇకపై ఎవరి పర్మిషన్ అవసరం లేదంటూ పోస్ట్.. అసలేం జరిగిందంటే..**


సౌత్ ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్ గా మంచి ఫాలోయింగ్ సొంతం చేసుకుంది అనుపమ పరమేశ్వరన్. తెలుగుతోపాటు తమిళం, మలయాళం, కన్నడ భాషలలో అనేక హిట్ చిత్రాల్లో నటించి.. అటు ట్రెడిషనల్.. ఇటు గ్లామరస్ పాత్రలతో కుర్రాళ్ల హృదయాలు దోచుకుంది ఈ ముద్దుగుమ్మ. గతేడాది అరడజను సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సందడి చేసిన ఈ అమ్మడు.. ప్రస్తుతం చేతినిండా ప్రాజెక్టులతో బిజీగా ఉంది. అయితే కొన్ని రోజులుగా అనుపమ వ్యక్తిగత జీవితం గురించి అనేక విషయాలు నెట్టింట చక్కర్లు కొడుతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా కోలీవుడ్ హీరో ధృవ్ విక్రమ్ తో ఆమె ప్రేమలో ఉందనే ప్రచారం జోరుగా సాగింది. ఈ రూమర్స్ పై అటు అనుపమ గానీ.. ఇటు ధృవ్ విక్రమ్ గానీ స్పందించలేదు. కానీ కొన్ని రోజులాగ అనుపమ నెట్టింట సైలెంట్ అయ్యింది. ఆమె చివరగా మే నెలలో ఇన్ స్టాలో పోస్ట్ చేసింది. ఇక ఇప్పుడు మరోసారి నెట్టింట యాక్టివ్ అయ్యింది. ఇకపై తనకు ఎవరి పర్మిషన్ అవసరం లేదని.. ఇప్పుడు ఎలాంటి భయాలు లేవు.. వేరొకరి అప్రూవల్స్ కోసం, క్యాప్షన్స్ కోసం ఎదురుచూడాల్సిన పనిలేదని.. తిరిగి తనను తాను ఆవిష్కరించుకుంటానని రాసుకొచ్చింది.

"కొన్నిసార్లు, మనశ్శాంతిని పొందాలంటే ఫలితం లేని దారులను వదిలేయాల్సిందే. ఈ రోజు, ఆ ప్రశాంతత నన్ను వెతుక్కుంటూ వచ్చింది. ఈ క్షణం నుండి, నా గళాన్ని నేనే ఎంచుకుంటున్నాను. నా జీవితాన్ని నేనే ఎంచుకుంటున్నాను. ఇకపై ఎవరి అనుమతులూ అవసరం లేదు. భయానికి తావు లేదు. కేవలం నేను... నన్ను నేను తిరిగి కనుగొంటూ, ఒకప్పుడు నాదే అని మర్చిపోయిన ఆ జీవితాన్ని మళ్లీ ప్రేమిస్తూ సాగిపోతున్నాను. అలాగే, చాలా కాలంగా నేను చెప్పాలనుకున్న ఒక విషయం ఉంది... చాలా కాలం పాటు చెప్పడానికి నాకు అవకాశం దక్కని విషయం అది. మీ అందరినీ నేను ప్రేమిస్తున్నాను. నాకు అండగా నిలిచినందుకు, నన్ను నమ్మినందుకు , నా జీవితాన్ని ఎంతో ప్రేమతో నింపినందుకు మీకు ధన్యవాదాలు. ఒకవేళ ఇంతకుముందు నేను దీన్ని తగినంతగా చెప్పలేకపోయి ఉంటే, నా మనసులో ఆ భావన ఎప్పుడూ ఉండేదని దయచేసి తెలుసుకోండి. నాకు అత్యంత అవసరమైన సమయంలో మీ ప్రతి సందేశం, ప్రతి ప్రార్థన మరియు మీ ప్రతి ప్రేమపూర్వక స్పందన నన్ను చేరాయి. నన్ను తిరిగి నా వైపు నడిపించినందుకు విశ్వానికి కృతజ్ఞతలు. ఇది స్వస్థతకు స్వాగతం. స్వేచ్ఛకు స్వాగతం.




# అల్లు అర్జున్ 'రాకా' టీంలోకి మరో భామ..

-ఇంతకీ పాత్ర ఏంటో మరి..?




టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో 'రాకా' సినిమా వస్తుందని తెలిసిందే. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే మలయాళ నటి ఫెమినా జార్జ్, పంజాబీ నటి నైలా గ్రేవల్ భాగమైనట్టు క్రేజీ అప్‌డేట్స్ వచ్చాయని తెలిసిందే. తాజాగా మరో ఆసక్తికర నెట్టింట వైరల్ అవుతోంది .తెలుగు నటి సిరి హన్మంతు 'రాకా' చిత్రంలో జాయిన్ అయింది. రీసెంట్‌గా జరిగిన ఓ ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. సిరి హన్మంతు చివరగా సీతాపయనంలో మెరవగా.. త్వరలో విడుదల కానున్న ' చెన్నై లవ్ స్టోరీ' లో కూడా సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో ఇంతకీ సిరి హన్మంతు రాకా మూవీలో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ముంబైలో షూటింగ్ కొనసాగుతోంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ తెరకెక్కిస్తోంది. ఈ మూవీని 2027 చివరలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సాయి అభ్యాంకర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.

# సౌత్ ఇండస్ట్రీలో కయాదు లోహర్ సంచలనం

చాప కింద నీరులా సౌత్ ఇండస్ట్రీలో సంచలనాలు రేపుతున్న భామ కయాదు లోహర్. మొదట్లో నెమ్మదిగా కెరీర్ ప్రారంభించినా, ఇప్పుడు ఎక్కడ చూసినా ఈమె పేరే వినిపిస్తోంది. తమిళం, తెలుగు, మలయాళం అని తేడా లేకుండా అన్ని చోట్లా తనదైన నటనతో ఆకట్టుకుంటున్నారు. అందం, అభినయంతో ప్రేక్షకులను మెప్పిస్తున్న కయాదు, ప్రస్తుతం దక్షిణాదిలో ట్రెండింగ్ హీరోయిన్‌గా మారారు. ముఖ్యంగా తమిళనాట ఆమె చక్రం తిప్పుతున్నారు. సూర్య నటిస్తున్న 48వ చిత్రంలో కయాదు లోహర్ హీరోయిన్‌గా ఎంపికయ్యారు. జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంతో పాటు, అజిత్ హీరోగా అజిత్ రవిచంద్రన్ తెరకెక్కిస్తున్న సినిమాలోనూ ఈమె హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని అజిత్ స్వయంగా నిర్మిస్తున్నారు. కోలీవుడ్ మాత్రమే కాకుండా, మలయాళంలోనూ కయాదు పేరు బాగా వినిపిస్తుంది. టోవినో థామస్‌తో కలిసి పల్లి చాటాంబి సినిమాలో నటించిన ఈమె, తాజాగా దుల్కర్ సల్మాన్‌తో ఐ యామ్ గేమ్ చిత్రంలో నటిస్తున్నారు.



Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465